రంగనాయకమ్మ

# 'అమ్మ'కి ఆదివారం లేదా?

**ఇంకా తెల్లారలేదుగానీ, తెల్లారగట్ల వెన్నెలతో తెల్లగా తెల్లారినట్టే వుంది. అప్పుడే ఏం తినేద్దామనో అన్నపూర్ణమ్మగారి వాకిట్లో చెట్ల మీద పిట్టలన్నీ లేచేశాయి. లేచేసి, దేని రెక్కలతో అది గంతులూ, దేని కంఠంతో అది కూతలూ, అందుకే లేచినట్టు, మొదలెట్టేశాయి. "ఏవిటా గంతులూ? అరుపులూ? ... పనీ పాటా లేకుండా!" అని కాస్త కూకలేసే పెద్దవాళ్ళెవరూ లేనట్టుంది చెట్ల మీద!... వాకిట్లో ఎన్ని అంట్లగిన్నెలో! వాటి నిండా ఎన్ని మెతుకులో... ఎన్ని వడియాల పిసళ్ళో!**

ఇంకా కావాలంటే వాకిట్లో మొక్కల మీద అక్కడక్కడా ఎర్రవీ పచ్చవీ ఎన్ని పురుగులో!... అన్ని పురుగుల్ని పెట్టుకుని పిట్టలేవీ వాటి వేపు ముక్కులన్నా తిప్పకపోతే ఏమనాలీ వాటినీ? రెండు కాకులు మాత్రం అంట్ల గిన్నెల వేపు దూసుకెళ్ళాయి, రయ్యిన. అదీ తెలివంటే! ఊరికే కొమ్మల మీద ఇటూ అటూ గంతులేసేస్తోంటే ఏం వొస్తుంది పొట్టల్లోకి, పిట్టలకైతే మాత్రం? లేచాక ఇటో అటో ఎటో అటు వెతుక్కోవద్దూ చప్పున? కాస్త ఎండ పొడవొస్తే పురుగులు పైపైకి పాకుతూ కూచుంటాయా? అప్పుడు దొరకమంటే దొరుకుతాయా?

ఆ పురుగులికి మాత్రం?.... వాటికి మాత్రం ఏం తెలివి వుందీ? చెట్ల మీద అన్ని పిట్టల్ని పెట్టుకుని, తెల్లగా తెల్లారి పోతోంటే ఆ పాకడాలేవిటి? ఏవిటో... వాటి ధైర్యాలేవిటో... అవేవిటో!

పురుగులే కాదు, పిట్టలేకాదు, ఆ ఇంట్లో మనుషులు కూడా ఆ పూట అలాగే వున్నారు, తెలివిమాలి!

ఇంకా అరవై ఏడేళ్ళన్నా నిండని జగన్నాధం గారు "పెద్దవాడినై పోలేదూ?" అని రోజూ తనని తను అపార్ధాలు చేసుకుంటూ, ఎప్పుడూ దగ్గుతూనే ఉంటాడు, 'అంతకన్నా ఏం చెయ్యనూ?' అన్నట్టు! .... ఏం చేసేదేమిటి? లేచి, అన్నపూర్ణమ్మతో జత కలిసి ఆ గిన్నెలన్నీ తోముకోకూడదూ? కాకులు... ఆ గిన్నెల్ని అలా బంతుల్లా దొర్లించేస్తోంటే వినపడ్డం లేదూ?.... వూహూఁ... తెల్లరాక ఆయన అలాంటి పనులు పెట్టుకోడు. దగ్గులే పెట్టుకుంటాడు! పోనీ అవేమన్నా నిక్షేపంగా తడిదగ్గులా అంటే, అన్నీ పొడి పొడి దగ్గులే!... పొడి దగ్గులు కూడా వొక దగ్గులేనా? అవి లేకపోతే ఎంతా, వుంటే ఎంతా? వాటి కోసం కూడా ఇంకా మంచం మీదేనా? ఏవిటో... ఆయన వయసే ఆయనకి బోధపడదు!

పిట్టలు జగన్నాధాన్ని వినీ వినీ-

"జగన్నాధం ఎప్పుడూ అలా దగ్గుతాడెందుకూ? మనం దగ్గుతున్నామా? మనల్ని చూసి నేర్చుకోడేం?" అనుకుంటాయి చాలాసార్లు.

" 'మనం' దాకా ఎందుకూ? అన్నపూర్ణమ్మ దగ్గుతోందా? ఏవిటో, జగన్నాధం మరీనూ..." అనుకుంటాయి మళ్ళీ అవే.

"అప్పుడే దగ్గే వయసు కాదు జగన్నాధం నీకూ. దగ్గడానికి అంత తొందర పడతావెందుకూ? ముందు ముందు ఇంకా బోలెడు కాలం లేదూ దగ్గడానికీ?" అని ఆయనకి ఎవరూ చెప్పరు. చెప్పడానికి ఆయన అసలు ఎవరితోనన్నా మాట్లాడితేనా? మాట్లాడ్డానికి ఆయనకి మాటలే వుండవు, దగ్గడానికి దగ్గులేగానీ!

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఇంట్లో వాళ్లే వొచ్చి మాట్లాడితే మాత్రం ఆయన చక్కగానే జవాబులు చెవుతాడు - కాకపోతే అదీ దగ్గులతోటే! 'అలాగా' అనివొక చిట్టిదగ్గూ, 'సరేలే' అని కాస్త నిడివిదగ్గూ, 'పోనిద్దూ' అని కొంచెం దీర్ఘందగ్గూ, మొత్తానికి సంభాషణ ముగిసేలోపల, ఏ ఇరవై దగ్గుల్లో దగ్గి, కష్టం సుఖం అన్నీ మాట్లాడతాడు. ఆశ్చర్యం! ఇంట్లో వాళ్ళందరికీ, నాలుగేళ్ళ మనవడితో సహా, ఆయన దగ్గుభాష కొట్టినపిండి!

లేచీ లేవగానే చెవినపడే తొలిదగ్గే తొలి పిలుపని తెలిసి కూడా అన్నపూర్ణమ్మ వొక్కోసారి "కాఫీ.... తెమ్మంటా....రా?" అని ఇంతదీర్ఘం తీస్తోంటే, ఆయన 'ఖంగ్' మని వొక మెరుపుదగ్గు దగ్గుతాడు. అది, విసుగన్న మాట! "అదీ అడగాలా? "అని దానికి అనువాదం. "సరే...తెస్తానుండండి" అని ఆవిడ వెనక్కి బైల్దేరుతుంది.

ఇంట్లో దగ్గులంటూ పుట్టి ఏడో ఏడునడుస్తోన్నా అన్నపూర్ణమ్మ ఇంకా ఈ నాటికీ భర్తగారి దగ్గు దగ్గుకీ కొత్త కొత్తగా మళ్ళీ మళ్ళీ వులిక్కి వులిక్కి పడుతూనే వుంటుంది, ఎందుకో!

ఎందుకో ఏవిట్లెండి! తొలి దగ్గుకి తొలికాఫీ .... మలిదగ్గుకి మలికాఫీ .... ఏడోదగ్గుకీ ఏడోకాఫీ అందిస్తూ, భర్తగారి దగ్గుల చుట్టూ తిరగడం తప్ప, ఆవిడకి మాత్రం ఏవంత రాచకార్యాలున్నాయి గనకా? ఓ పేపరు చూస్తుందా, ఓ పుస్తకం చదువుతుందా, ఓ మహిళా సంఘానికి పోతుందా? ఇక ఇంట్లో దగ్గులికి వులిక్కి పడడాలు కూడా మానుకుంటే, ఆవిడకి మాత్రం ఏం తోస్తుంది గనకా? అందుకూ!

అన్నపూర్ణమ్మ భర్తతోటే కాదు, కోడళ్ళతోకూడా అంత మెత్తగానూ, అంత వులిక్కిపడుతూనూ, అంత దీర్ఘాలు తీస్తూనూ మాట్లాడుతూ వుంటుంది! ఏ కోడలికి ఏపని పురమాయించాలన్నా, "అమ్మాయ్ అరుణా! అమ్మాయ్ కమలా!" అని రేడియో నాటకాల్లో లాగా ఇద్దర్నీ ఒకేసారి పిలుస్తుంది. చెరోచోటా పనుల్లో మునిగిన కోడళ్ళు, చెరో మూల నించీ "వొస్తున్నా నత్తయ్యా!" అని ఏక కంఠంతో కేకలు పెడతారు గానీ వొక్కరూ రారు. ఈవిడే వాళ్ళ దగ్గిరికిపోయి "ఏవిటమ్మా ఇదీ?" అంటుంది. వాళ్ళు - "ఇదేవిటంటే అత్తయ్యా...." అని అదేవిటో చెవుతారు. "ఓహో! అదా ఇదీ?" అని ఆవిడ సంతోషించి, ఈలోగా ఏదగ్గన్నా చెవిన పడితే "వొస్తున్నా నుండండి" అని ఆ దగ్గుకి జవాబిస్తుంది. "ఓసారి హనుమంతునడిగి... అదేదో కషాయం వుందన్నాడు....కాస్త మింగకూడదూ?.... ఈసారి నే నడుగుతా నుండండి" అని వాగ్దానం చేస్తుంది.

"ఖంగ్...." మంటాడు జగన్నాధం."ఆఁ... దగ్గుకి కూడా మందేనా?" అని దాని అనువాదం.

"అలాగంటే ఎలాగమ్మా! నోట్లో మందేసుకోడం అంటే కంఠం పట్టుకుంటుంది మీకు. ఓ గుక్క కాఫీ తెస్తానుండండి"

"ఖాంగ్...."మంటాడు ఈసారి. "అదీ అలా చేద్దూ!" అని దాని తాత్పర్యం!

ఆ తెల్లార గట్ల కూడా జగన్నాథం పిట్టలతో పాటే లేచి, ఒకళ్ల జోలికీ శొంఠికీ పోకుండా, తన దగ్గులేవో తను దగ్గుకుంటున్నాడు. ఇక పిట్టలన్నీ గూళ్ళకి చేరే దాకా అది అలా సాగవలసిందే!

"పైసా ఖర్చులేని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మనింట్లో!" అంటూ వుంటాడు రెండో కొడుకు వాసు.

"ఏడిశావ్‌లే. పెద్దా చిన్నా లేదా?"అని పెద్దవాడు ప్రసాద్, తన పెద్దరికం ప్రదర్శించ బోతాడు.

"పెద్దా చిన్నా వుంటుందిలేవోయ్! పెద్ద దగ్గుకీ చిన్న దగ్గుకీ తేడా నాకూ తెలుసులే" అని, చిన్నవాడు పెద్దవాణ్ణి 'పోవోయ్' అనేస్తాడు.



ఇంకా చిన్నవాడు వేణూ అయితే మరీ ఘోరం! "పెద్దేవిటి, చిన్నేవిటి? అందరూ పెద్దే!" అంటాడు. అదేవిటో అతనిది, తేడాలే లేని సిద్ధాంతం! ఎప్పుడు ఎవరితో మాట్లాడినా "తిరగబడు!" అనే మాట తప్ప రెండోమాట రానివ్వడు.

'చూశావా వేణూ? నిన్న మీ అన్నని కూరలు తెమ్మంటే చేతులూపుకుంటూ వొచ్చి 'అబ్బా, నువ్వే తెచ్చుకో' అంటున్నారు. ఇప్పుడు ఏంవొండనూ?' అని ఏ వదిన అన్నా, పురమాయిస్తే, తను మాత్రం తిరగబడడు. అప్పటికే సైకిల్ తీసి సిద్ధమైపోతాడు.

కానీ, ఆపూట వేణూని చీకట్నే ఏ వదినా లేపలేదు.

పాతికేళ్ళు నిండిన అరుణ కొంచెం పొట్టీ కొంచెం బొద్దూ! పొట్టి చేతుల జాకెట్టూ, జాకెట్ల మీద తళ్ తళ్ అద్దాలూ, చీర అంచుల నిండా జిగ్ జిగ్ ఎంబ్రాయిడరీలూ ఇష్టం. అద్దాలూ పూసలూ తనే ఓపిగ్గా కుట్టుకుంటుంది. చీకట్నే లేచీ లేవగానే, మొహం కడిగీ కడగ్గానే, ఇంత కుంకం తీసి నుదిటికి అద్దేస్తుంది, అటెనక దొడ్డో చెట్ల వెంట తిరిగి బంతిపువ్వో, మందారపువ్వో, ఆఖరికి కనకాంబరం అయినా సరే ఏదో ఒకటి సంపాదించి జడపాయల్లో దోపేస్తుంది. ఆ రొండు కార్యాలూ ముగిస్తే తప్ప, వంటింట్లో కాలుపెట్టదు. ఆ పూట ఆ కార్యాలు రొండూ ఎప్పుడో ముగిశాయి. కానీ వంటింటి ఛాయలకి పోకుండా ఇంకా వీధి వాకిట్లోనే తచ్చాడుతోంది.

ఇంకా పాతికేళ్ళు నిండని కమల కొంచెం పొడుగూ, కొంచెం బక్కా. తోటి కోడలి లాగ తల షోకూ, గుడ్డల షోకూ చూసుకోదు. అసలు కమల పూర్తి పేరు - వేలుముడి కమల! ఇంట్లో వాళ్ళు గానీ ఇరుగుపొరుగు వాళ్ళు గానీ కమలని వేలు ముడితో తప్ప ఇంకో రకం కురుల అలంకారంతో చూసి వుండరు. లేస్తే వేలుముడీ, కూచుంటే వేలుముడీ ! స్నానానికి పోతూ గట్టిగ వేలుముడీ, వొచ్చాక వొదులుగా వేలుముడీ! ఆఫీసుకి పోయేముందే ఎలాగో రొండు పాయలు పైపైన అల్లుతుంది. మళ్ళీ ఆఫీసులో మధ్యమధ్యలో చేతులు రొండూ పైకెత్తేసి జడని కాస్తా వేలుముడిలోకి తిప్పేస్తుంది. అసలు ఇన్ని మాట లెందుకూ? పెళ్లి చూపులప్పుడు, కమల మొహంలో సిరులూ కళలూ వాసు సిగ్గు సిగ్గుగా చూస్తూ ఉండగానే కమల ఇటూ అటూ కదలి జడని ముడి పెట్టేసింది.

ఆ వేలుముడి కమల, ఆ చీకట్నే, తల నున్నగా దువ్వి వాలు జడ వేసుకుంది, పరమాశ్చర్యంగా! చూస్తే తప్ప ఎవరూ నమ్మరు! తోటికోడలు తప్ప ఎవరూ ఇంకా చూడలేదు.

పొడిపొడి దగ్గులు చెవుల్లో పడి అన్నపూర్ణమ్మ కంగారు పడుతూ ఆ చీకట్నే లేచిపోయి "అమ్మాయ్ అరుణా!" అని ఎందుకో పెద్ద కోడల్ని మాత్రమే పిలిచి "పాలు వొచ్చేశాయేమో చూడమ్మా! మావయ్యకి దగ్గొస్తోంది. వేడిగా కొంచెం కాఫీ పెడతానూ!" అని మంచం దిగేదాకా దీర్ఘం తీసింది.

"ఎప్పుడో వొచ్చేశాయి అత్తయ్యా! ఇదుగో, ఇక్కడే వున్నాయి. పేపరు కూడా వొచ్చేసింది" అని, సరిగ్గా ఆ మాటలు ఎప్పుడు చెపుదామా అని ఎదురు చూస్తోన్నట్టు చురుగ్గానూ, వుత్సాహంగానూ అరిచింది అరుణ.

"ఎప్పుడో వొచ్చేస్తే లోపలికి తీసుకురాకండా ఏం చేస్తున్నావూ?" అని దీర్ఘం తీసి-"సరేలే తొందరగా పట్టుకురా! ముందు ఒక సంచి గిన్నిలోకి తీసి ఇయ్యి" అని అన్నపూర్ణమ్మ ముద్దుగా కోడలికి పని పురమాయించింది.

కానీ కోడలు ఒక నవ్వు నవ్వి-"భలేవారే అత్తయ్యా! ఇవ్వాళ ఆదివారం కాదూ?" అని ఇంకో నవ్వు నవ్వింది.

"వూఁ... ఆదివారం అయితే? పాలు లోపలికి తెమ్మంటే ఆదివారం కాదూ ఏవిటి?"

"ఆదివారం... ఇంట్లో ఆడవాళ్ళందరికీ సెలవు కదా అత్తయ్యా!"అని కోడలు మళ్ళీ నవ్వింది.


"ఆదివారం... ఆడవాళ్ళకి సెలవా?... సెలవేమిటి? ఎవరిస్తారు?" అత్తగారు తికమక పడింది.

'వొకరిచ్చే దేమటి? మనమే తీసుకుంటాం' అని కోడలు పౌరుషపడి "ఇవ్వాళ మనం ఏ పనీ చెయ్యక్కర్లేదత్తయ్యా! రాత్రి అనుకున్నదంతా మరిచి పోయారా ఏమిటి?" అని, ఆ అనుకున్న దేవిటో గుర్తు చేసింది.

"రాత్రి ఏదో నవ్వులాటలుకి అన్నారనుకున్నానే! నిజంగా సెలవా ఏవిటీ?"

"నవ్వులాటలేం కాదు. ఆషామాషీ అనుకుంటు న్నారేవిటి? ఇవ్వాళ మన నలుగురికీ నిజంగా సెలవే. మీ అబ్బాయిల్ని లేపండి! వాళ్లే తెచ్చు కుంటారు పాల సంచులు లోపలికి" అని సెలవు దినం ఎలా ప్రారంభం అవ్వాలో కోడలు వివరించింది.

అత్తగారు ఇంకా నమ్మలేనట్టు "ఇవ్వాళ... ఆడవాళ్ళకి సెలవా?... పనులన్నీ మొగాళ్ళే చేసుకుంటారా? మరీ... ఒక వేళా... వాళ్లు చెయ్యకపోతేనమ్మా?" అని ఒక సందేహం ప్రకటించింది.



"మీరు మరీనూ అత్తయ్యా! ఎందుకు చెయ్యరూ? మనకి సెలవైతే వాళ్ళు చెయ్యొద్దూ? గవర్నమెంటు మాట అనుకున్నారా?... ఏం, మనం రోజూ చెయ్యట్లేదూ? వారానికి ఒక్క రోజు వాళ్ళు చెయ్యలేరూ?" అని కోడలు ప్రశ్న మీద ప్రశ్న గుప్పించింది.

అత్తగారికి అప్పటికి గ్రహింపైంది. "అయ్యో... అయ్యో... ఇదేం చోద్యవమ్మా? ఇలాంటి విడ్డూరాలు పుట్టిస్తున్నారూ? ఆ గవన్నమింటు వాళ్ళకేం పుట్టిందీ? వాళ్ళకి మొగపిల్లలు లేరూ? ఇప్పుడు మొగాళ్ళు లేచి పనులు చేస్తారా? అవ్వ!" అని బుగ్గలు నొక్కుకుని అలాగే నిలబడి పోయింది.

కోడలు నవ్వి - "అవ్వ అంటారేవిటత్తయ్యా? ఆడవాళ్ళ కోసం గవర్నమెంటు ఎంతబాగా ఆలోచి స్తోందో అర్థం చేసుకోరేం? మన కోసం చట్టం వొచ్చేస్తోందని సంతోషిస్తామా, 'అవ్వ, అవ్వ' అని బుగ్గలు నొక్కుకుంటామా చెప్పండి" అని సూటిగా ప్రశ్న వేసింది.

"ఇతకీ... అదేదో... ఆ చట్టం ఏదో... వొచ్చే సిందా, ఇంకా వొస్తోందా??"

"ఆఁ.. వొచ్చేసే వుంటుంది ఇవ్వాళ. వొచ్చేసినట్టే."

"ఆఁ.. ఇంత చీకట్నే ఏం వొస్తుంది గానీ... చట్టం వాళ్ళు మాత్రం లేవొద్దూ?... ఈ లోగా... వొక్క సారి ఆ పాల పొట్లాలు లోపలికి తెచ్చేద్దూ అమ్మా! మంచి దానివి గానీ..."

"అయ్యో అత్తయ్యా! అర్థం చేసుకోరేం? రోజూ ఈ పనులన్నీ మనమే ఎందుకు చెయ్యాలి? మొగాళ్ళందరికీ సెలవలు వుంటాయి కదా? మరి మనకి మాత్రం వుండొద్దా? లేపండి మీ అబ్బాయిల్నీ! వాళ్ళే తెచ్చుకుంటారు లోపలికి."

"అయ్యయ్యో! ఎప్పుడూ చీకట్నే లేచి పనులన్నీ చేసుకునే దానివి. గోవు లాంటి మనిషివి! చెప్తే వినే లాగ లేవు... హూ... కమలనన్నా పిలుస్తాను... అమ్మాయ్ కమలా! వొక్కసారి లేచి రామ్మా, మళ్ళీ పడుకుందువు గానీ. ఆ కుర్రాడు ఎక్కడో గేటు దగ్గిర పారేసి పోతాడు. ఏ కుక్కలు లాక్కు పోతాయే ఏమో. కమలా, లేస్తున్నావా?"

"వొస్తున్నా, వొస్తున్నా అత్తయ్యా! ఎప్పుడో లేచాను" ఎటో పలికింది కమల.

"లేచే ఉన్నావా? అప్పుడే ఎందుకు లేచావూ? ఏం చేస్తున్నావూ?"

"పేపరు చదువుకుంటున్నానత్తయ్యా!"

"అయ్యో! పొద్దున్నే పేపర్లు పెట్టుక్కూచుంటే ఎలాగమ్మా?" అత్తగారే కోడలి దగ్గిరికి నడిచి, కోడల్ని చూడగానే మొదట తెల్లబోయి, తర్వాత సంతోషిస్తూ "తలెప్పుడు దువ్వుకున్నావూ? ఎంత బాగుందో చూడు జడ అల్లుకుంటే! ఇవ్వాళ నీ బుర్రలో పురుగెలా తిరిగిందీ?" అని నవ్వు మొహంతో చూసింది.

"ఇవ్వాళ ఖాళీ వుంది కాబట్టి తీరిగ్గా తల దువ్వుకున్నానత్తయ్యా!"

"ఆఁ... మరీ చోద్యం! రోజూ మాత్రం అంత ఖాళీ లేదా? సరేలే, పాల సంచులు లోపలికి తీసు కురామ్మా! మావయ్యకి దగ్గొస్తోంది. తొందరగా కాఫీ ఇస్తానూ!"

"అయ్యో, దగ్గొస్తోందా? అయితే వేడిగా ఏదన్నా తాగాలి తొందరగా... మరి ఎలాగత్తయ్యా! ఇవ్వాళ మనందరికీ సెలవు. మొగాళ్ళే ఈ పనులన్నీ చూసుకోవాలి. వాళ్లేఅందరికీ కాఫీలివ్వాలి. ఎప్పుడు లేస్తారో ఏమో!" అని కంగారు పడింది కమల.

అత్తగారు తెల్లబోయి "నువ్వూ అదే పాటా? ఇద్దరూ వొక బళ్ళోనే చదివినట్టున్నారే! మొగ పిల్లలు లేచి కాఫీలు పెడతారా మనకి?" అని తెల్లబోవడం కొనసాగించింది.

కమల మొహంలోకి అప్పుడే కోపం తొంగి చూసింది. "ఏం, ఎందుకు పెట్టరూ? పూటపూటా


DAP బ్రాహ్మీవిటా గ్రాన్యూల్స్

శంఖపుష్పి బ్రాహ్మీల మిశ్రమం




Available in all Medical Shops

- బ్రాహ్మీ వీటూ చాతుర్యం
- చదివిన ఉండును జ్ఞాపకం
- చేయును పరీక్ష ఉత్తీర్ణం

జ్ఞాపక శక్తిని పెంచి మానసిక వికాసాన్ని కల్గిస్తుంది

DECCAN AYURVEDASHRAM PHARMACY LTD.
Saidabad, Hyderabad-500 059, A.P.

మనం పెట్టి అందించడం లేదూ?... లేచి మొహం కడుక్కోగానే పేపరు చదువుకోవాలని నాకెంత కోరికో! ఇవ్వాల్టికి అయ్యింది! పేపరు చదువుతూ కాఫీ తాగుతుంటే ఎంత బాగుంటుందో! మొగాళ్లు అలాగే చేస్తారు."

"మీ పిచ్చి దొంగల్దోలా! వాళ్ళు లేవడవూ... మనం వేడి వేడిగా వూదుకుంటూ కాఫీలు తాగడవూనా? మీరు నిజంగానే ఎదురు చూస్తున్నారా ఏవిట్రా?"

'ఏం, ఎవడికోసం పెడతారు? పెట్టకపోతే గవర్నమెంటు వూరుకుంటుందనుకుంటున్నారా?'

"ఏం చేస్తుందీ గవన్నమింటూ?"

"ఏం చేస్తుదో చూద్దురుగాని మీరే"

లోపల్నించీ దగ్గులు చెవిన పడనే పడ్డాయి.

"అయ్యయ్యో! మావయ్య దగ్గుతున్నారు. నేనన్నా పోయి తెస్తాలెండి" అని అన్నపూర్ణమ్మ వీధి వాకిలి వేపు బైల్దేరింది.

'అత్తయ్యా! మీరు తేవడానికి వీల్లేదు" అని అరిచింది అరుణ కోపంగా. అత్తగారితో ఎన్నడూ గట్టిగాకూడా మాట్లాడడం ఎరగని అరుణ శాసించినట్టే అంది ఆ మాటలు. "మీరైతే ఒకటీ, మేమైతే ఒకటీనా? ఇవ్వాళ మీరు చేసినా మేం వొప్పుకోం. కొడుకుల్ని లేపండి.ఇంకా ఎప్పుడు లేస్తారూ ఏవిటి?'

"అయ్యో! మావయ్య దగ్గుతున్నారమ్మా!"

"దగ్గితేనే మంచిదత్తయ్యా! దగ్గితే అదే తగ్గుతుంది".

"ఏవిటీ తగ్గేదీ?"

"దగ్గే! దగ్గితే దగ్గు తగ్గిపోదూ?"

"బాగానే ఉన్నాయి మీ కవుర్లు"

'ఇవ్వాళ మీరాగోలలేవీ పట్టించుకోకండి. తొందరగా మొహం కడుక్కురండి. కవుర్లు చెప్పుకుందాం. లేకపోతే ఏ పచ్చీసో ఆడుకుందాం.'

"ఆయన దగ్గుతోంటే, మనం పచ్చీసు ఆడుకుందామా? దగ్గు వినపడకండానా?"

"లేకపోతే మనమేం చేస్తాం? కొడుకులకి ఉండాలి ఆ తెలివి"

అత్తగార్ని తమతో కూడగట్టుకోకపోతే లాభం లేదని కమలకి అప్పుడే అర్థమైంది.

అత్తగారికి నచ్చచెప్పే ధోరణిలో కంఠం తగ్గించి గుసగుసలాడింది. "అత్తయ్యా. ఇది మనమంచికే. ఆడవాళ్లందరం ఒక కట్టుగా ఉండాలి. అదే మనకి బలం!... మీరు చిన్నతనం నించీ ఇంట్లో పనులన్నీ చేస్తూనే ఉన్నారు కదా? ఒక్క రోజన్నా మావయ్యగానీ, మీ కొడుకులుగానీ మీకు సాయం చేశారా చెప్పండి. వేణూ కొంచెం నయమే కానీ.... మరి మిగతావాళ్లు? వాళ్లు మీకేం చేశారు?"

"చెయ్యలేదనుకో. నేనైనా వాళ్లకేనాడూ ఇంటిపనులు చెప్పలేదమ్మా! మొగసన్నాసులు.. వాళ్లేం చేస్తార్లే అనీ, లేచినా లేవకపోయినా, తెగులొచ్చినా రోగమొచ్చినా, ఎలాగో ముక్కుతూ మూలుగుతూ, నేనే చేసుకునేదాన్ని. ఇవ్వాళంటే ఈ కుక్కర్లూ గిక్కర్లూ వచ్చాయి గానీ. మా రోజుల్లో ఇవన్నీ ఎక్కడివీ? ఇదుగో, ఈ నాటికి మీరొచ్చాక.. కాస్త కాళ్లూ చేతులూ దగ్గిర పెట్టుకుని కూచుంటున్నాను."

అత్తగారు మెత్తబడుతోందని కమలకి బాగానే అర్థమయింది.

అత్తగారు మళ్లీ అంది-"మా రోజుల్లో నేనొక్కదాన్నేనా? అందరూ అంతే. మా అత్తగారూ వాళ్ళూ వొడ్లు కూడా దంచేవారట. మా అమ్మ ఎప్పుడు నిద్రపోయేదో నా కళ్లతో నేను చూడలేదు."

"చూశారా మరి? ఆడవాళ్ళు ఎప్పుడూ అంతంత కష్టాలు పడ్డారు. అందుకే ఆడవాళ్ళకి ఈ నాటికైనా వారానికోరోజు సెలవు ఇస్తున్నారు. దాన్ని మీరు అడ్డం కొడతారా చెప్పండి. మీరేమీ కొడుకులకి వంట చేసి పెడతారా?"

"అబ్బే, నేనెందుకు అడ్డం కొడతాను గానీ, కొంచెం పాలు లోపలికి తెచ్చేసి, కొంచెం ఆయనకి కాఫీ ఇచ్చేసి,...."

"ఆఁ..... ఇలా 'కొంచెం' 'కొంచెం' అని మొదలు పెడితే అన్నీ మననెత్తినే పడతాయి. ఇకవాళ్ళు చేసేదేముంటుంది? మనమే ఇలా మెత్తబడిపోతే మనల్ని చట్టాలేం రక్షిస్తాయి?.... లేవమనండి మీ పెద్ద కొడుకులిద్దర్నీ. పాపం వేణూనీ లేపకండి. అతనికి వీలున్నప్పుడల్లా మనతోపాటు చేస్తూనే ఉన్నాడు. అతన్ని వొదిలేద్దాం గానీ పెద్దవాళ్ళిద్దర్నీ ఇవ్వాళ పనుల్లోకి దించి తీరాలి! లేవమనండి ఇద్దర్నీ తొందరగా. లేచి పాలు లోపలికి తెచ్చి, అందరికీ కాఫీలు ఇవ్వమనండి.'


అరుణ అందుకుంది "తర్వాత ఇంకా టిఫెను చెయ్యాలి. వంట చెయ్యాలి, బోలెడు పనులున్నాయి. అవన్నీ ఎప్పుడు చేస్తారు?"

అన్నపూర్ణమ్మ మళ్ళీ కొత్తగా ఉలిక్కిపడింది- "అవన్నీ కూడా చెయ్యాలా? చెయ్యాలన్నా వాళ్లకి రావు కదర్రా!" అని నోరు తెరిచింది.

పెద్దకోడలు ఖయ్యిమంది-"రాకపోతే నేర్చుకుంటారు.మనం నేర్చుకోలేదూ? నేర్చుకుంటే అన్నీ వొస్తాయి. కావాలంటే రొండుమూడు వారాల దాకా మనం దూరంగా నించుని సలహాలిద్దాం" అంది.

అన్నపూర్ణమ్మకి ఎందుకో నచ్చలేదు. మళ్లీ మొదటికొచ్చింది. 'యావిటో.... ఈ చట్టాలూ చట్టబండలూనూ... ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చిందనీ.. వాళ్ళు లేవనూ, మనకి వంటలు చేసి పెట్టనూ! ఇక తిన్నట్టే! ఎవరన్నా వింటే నవ్వుతారు' అని తనే నవ్వింది తాపీగా.

కమలకి అత్తగారి మీద బాగా కోపం వచ్చింది- "ఎవరన్నా కాదు. మొగాళ్ళొక్కళ్ళే నవ్వుతారు. వాళ్ళు నవ్వితే మనకేం లెక్క? గవర్నమెంటే మన పక్షాన ఉంది" అంది. అయినా అత్తగారి సపోర్టు ఎంత తప్పని సరో కమలకి మళ్ళీ గుర్తొచ్చింది. బతిమిలాటలోకి దిగింది హఠాత్తుగా "మా మాట వినండత్తయ్యా! చక్కగా కూచోండి. పేపరు చదివి వినిపిస్తాను. ఆహ్హా.. ఎంత తీరిగ్గా ఉందో ఈ



పూట! ఇన్నాళ్లూ నేను ఎవరికీ ఓటెయ్యలేదు గానీ ఈసారి ఎన్నికలొస్తే ఈ గవర్నమెంటుకే ఓటేస్తాను. ఆడవాళ్ళందరం వీళ్ళకే వెయ్యాలి సుమా!.. మరి చదవనా? వినండి!" అని పేపరు పఠనం మొదలు పెట్టింది.

"మద్రాసులో స్వల్ప భూకంపం! నిన్న అర్ధరాత్రి మద్రాసులో భూమి స్వల్పంగా కంపించింది. ఈ కంపనాలు ఇటూ అటూ ఎటైనా పాకవచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు...'


'అయ్యో పాపం... పొద్దున్నే ఇదేం కబురే పాపం! ఎవరన్నా చచ్చిపోయారేవిటమ్మా పాపం?'

"అత్తయ్యకి మరీ జాలి" అని నవ్వింది కమల.

"లేదులెండి అత్తయ్యా!" అని అత్తగారికి ధైర్యం చెప్పి మళ్ళీ చదవడం ప్రారంభించింది. "జననష్టం గానీ, ఆస్తినష్టంగానీ జరగలేదూ. కొంచెం కిటికీ తలుపులూ అవీ దబదబా కొట్టుకున్నాయీ...."

"పోనీలేమ్మా!" అని అత్తగారు చాలా సంతోషించింది-"లేచేపాటికి కాళ్ళూ చేతులూ అవీ విరిగి ఉంటే లేచి చూసుకుని వుసూరు మంటారు. ఎవరూ చచ్చిపోకుండా, ఇళ్ళవీ పడిపోకుండా, పెద్ద పెద్ద భూకంపాలొస్తే చూడ్డానికి కూడా సరదాగా ఉంటుందేమో! అవునే కమలా, నాకు తెలీకడుగుతానూ, పొలాల్లో భూకంపం వస్తుందనుకో. పొలం విచ్చుకుంటుంది కదా? అప్పుడు మనం ఆ పగుళ్ళల్లో నించి లోపలికి చూస్తే లోపల ఏం కనిపిస్తుందంటావూ?... పాతాళంలో యమ ధర్మరాజూ వాళ్లూ ఇటూ అటూ తిరుగుతూ కనపడతారేమో, యేం?"

"అవన్నీ కట్టుకథలత్తయ్యా! అక్కడా కూడా





మట్టీ, నీళ్ళే ఉంటాయి. మహాఅయితే కప్ప లుంటాయో ఇటూఅటూ దూకుతూ"

"ఛా! అంతేనా?... మరి అక్కడ పాతాళం.. నరకం.. ఇదీ అదీ అంటారేం?" అని అత్తగారు విస్తుపోతుంటే లోపల్నించి దగ్గులూ, వాటితో పాటే "పూర్ణా" అని ఓ కేకా! "కాఫీతెస్తానని వెళ్లావు.... పొద్దునే పాతాళాలూ... నరకాలూ... ఏవిటే? బాగానే చూపిస్తున్నావు నాకు నరకం ఇక్కడే!" అని నిష్ఠూరాలూ! మళ్ళీ దగ్గులూ!

"అయ్యయ్యో! నా మతిమండా! ఏవిటో భూకంపం అంటే సరదాపడీ.. కమలా! తొందరగా ఆ పాలు తెచ్చెయ్యమ్మా! మీ అప్పగారెటు పోయిందో, నువ్వన్నా నా మాట విందూ!" అని అత్తగారు కోడల్ని బతిమాలింది.

కమల మళ్ళీ ఓర్పుని ఆశ్రయించాల్సి వచ్చింది - "మళ్ళీ మొదటికొస్తారేవిటత్తయ్యా? ఇవ్వాళ మనకి సెలవు అని అర్ధరాత్రి దాకా గుర్తు పెట్టుకోండి. మళ్ళీ మనం పనుల్లోకి దిగేది రేపొద్దున్నే.. నేనే పిలుస్తానుండండి వాళ్లని. వేణూ! వేణూ! నువ్వు లేవొద్దుగానీ మీ అన్నగార్లిద్దర్నీ లేవమనూ. ఎంత తెల్లారిపోయిందో తెలుసా? రోజూలాగ ఆది వారాలు కూడా 8 గంటల దాకా పవ్వళించే కాలం పోయిందని చెప్పు! మావయ్య దగ్గుతో వూపిరాడక అల్లాడి పోతున్నారు. లేవండి తొందరగా. అక్కయ్యా, బావగార్ని తొందరగా లేవమనూ" అని కమల పెద్ద పెద్ద కేకలు వేసింది.


**(సశేషం)**



రంగనాయకమ్మ

# అమ్మకి ఆదివారం లేదా?

(కిందటి సంచిక తరువాయి)




**రేఖ కళ్లు నులుపుకుంటూ లేచి వొచ్చింది. అన్నపూర్ణమ్మలాగే మహామెత్తని కుదురైన పిల్ల రేఖ. "ఏమిటి వొదినా! పొద్దున్నే హడావుడి చేసేస్తున్నారూ!" అంటూ ఇంకా నిద్రమత్తులో మెట్ల మీద కూర్చుంది.**

"నువ్వప్పుడే ఎందుకు లేచావూ? ఇవ్వాళ ఆడవాళ్లకి సెలవేగా? మీ అన్నలిద్దర్నీ లేపేసి ఇంకా కాస్సేపు పడుకో! వాళ్లు టిఫిన్ చేసేప్పటికి లేపుతాంలే నిన్ను!" అని కమల ఆడబిడ్డని ఇంకా నిద్రపొమ్మని ప్రోత్సహించింది.

రేఖ బాగా తేరుకుని- "ఏమిటి వొదినా మరీనూ. నిన్న ఏదో సరదాకి అనుకున్నాం గానీ" అని నవ్వింది.

"సరదా ఏమిటి, సరదా? మేం నిజంగానే అనుకున్నాం. నీకేం తెలుస్తుంది మా కష్టం? అన్నీ 'అమిర్చి పెడితే వేళ పట్టుకి తినేసి కాలేజీకి పోయే దానివి. నీకు అర్థం కాదులే అప్పుడే. బైట వుద్యోగం చేస్తోన్నా ఇంట్లో పనులన్నీ నేనే చెయ్యాలా? ఏనాడన్నా ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టాడా మీ అన్న? ఇవ్వాల్టికి కదా మా కష్టం గవర్నమెంటు కనిపెట్టింది! వెళ్లి అన్నల్ని లేపుదూ! ఒకరు కాఫీలు పెడుతుంటే ఒకరు వుప్మాయో ఏదో ఒకటి చేస్తారు. చూడు, పాల పేకట్లు ఇంకా అక్కడే పడి ఏడుస్తున్నాయి."

"అయ్యో, ఇంకా లోపలికి తేలేదా? నేను తెస్తానుండు" అని రేఖ ఛెంగున లేచింది.

"రేఖా!" అని కమల కోపం ప్రదర్శించింది. "నువ్వు తేవడానికి వీల్లేదు. ఆడవాళ్లందరం ఒక కట్టుగా ఉండాలి. ఇవ్వాళ పనులన్నీ మొగాళ్లే చెయ్యాలి, తెలిసిందా?"

"అవుననుకో వొదినా! నాన్నకి తొందరగా కాఫీ కావాలి కదా?...."

"అందుకే మరి, మీ అన్నలు తొందరగా లేస్తే

సమస్య తీరిపోతుంది."

అరుణ లోపలి నుంచి సంబరంగా - "కమలా! మీ బావగారు లేచి పోతున్నారులే" అని కేక పెట్టింది.

వేణూ కూడా లేచి వచ్చాడు-"వదినలిద్దరూ పోరాటం నిజంగానే మొదలు పెట్టేశారా?" అని కులాసాగా నవ్వేశాడు.

"ఏం నిజం కాక? ఒకరొచ్చి 'సరదాకా' అంటారు. ఇంకొకరొచ్చి 'నిజంగానా' అంటారు. అంత వెటకారంగా వుందా మా సెలవురోజంటే మీకు?" అని మొహం చిట్లించింది కమల.

"వెటకారంకాదు గానీ ఈ చట్టాల్ని మీరెంత నమ్ముతున్నారో కదా అనీ జాలిగా వుంది" అని జాలిగా నవ్వాడు వేణూ.

చేతిలో గ్రంథంతో వస్తూ అరుణ-"అదేమిటి వేణూ? నువ్వెప్పుడూ మాతరపునే వుంటావు. మొగాళ్ళు కూడా ఇంట్లో పనులు చెయ్యాలంటావు. ఇవ్వాళ ఇలా మాట్లాడు తున్నావేమిటి?" అని ఆశ్చర్యపడింది.

"పెద్దొదినా, నీకు ఎన్ని సార్లు చెప్పాను చిన్న వొదిన లాగా నువ్వ కూడా వుద్యోగం చెయ్యాలని? బైటికి వెళ్ళడం అంటేనే వడదు నీకు."

"ఇది మరీ బాగుంది. కమల అంటే చదువుకుంది కాబట్టి వుద్యోగం సంపాదించుకుంది. నా వానా కాలం చదువుకి నేనేం చేస్తాను బైటికి పోయి?"

. "నీ చదువుతో కూడా బోలెడు పనులు చెయ్యొచ్చు. స్వంత సంపాదన లేకపోతే, ఈ హక్కులూ సెలవలూ... ఇవన్నీ ఏమిటి?"

"ఆఁ ... నువ్వూ మొగాడివే లెద్దూ! ఆడవాళ్ళ సెలవు అంటే మొగాళ్ళకెవరికీ నచ్చదులే" అని మొహం తిప్పేసింది అరుణ.


"బాగా చెప్పావు" అని కమలకూడా తల తిప్పేసింది.

అప్పటికి లేచి వొచ్చాడు కమల భర్తగారు- "పొద్దున్న నించీ వొకటే గొడవ గొడవ! ఇలా నించున్నారేమిటి అందరూ?" అని అందర్నీ ఎగాదిగా చూస్తూ కమల వాలు జడ చూసి నోరు తెరిచాడు.

అరుణ భర్తగారు తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ వొచ్చి - "అరుణా! కొంపలు మునిగినట్టు ఎందుకంత తొందరగా లేపేశావ్? ఏకంగా మొహం కడుక్కుని వచ్చేశాలే. కాఫీ అయిందా? తీసుకురా తొందరగా" అని ఆజ్ఞాపించి, మళ్ళీ మొహం శుద్ధి కార్యక్రమంలో పడ్డాడు.

"అహ్హహ్హా" అంటూ చెల్లెలూ తమ్ముడూ నవ్వారు.

"ఏం పాలు రాలేదా ఇంకా?" అని సందేహించాడు ప్రసాద్.




తల్లిగారు అందుకుని - "ఏదో శాస్త్రం చెప్పినట్టుంది. పాలొచ్చి గంటసేపైంది నాయనా! లోపలికి తెండ్రా అంటే, వాళ్ళు తేరటా, నన్ను తేనివ్వరటా! ఆదివారం ఆడవాళ్ళకి సెలవని ఆ ముదనష్టపు గవన్నమింటేదో రాసిందటగా? కోడళ్ళిద్దరూ కొయ్యెక్కి కూచున్నారు. చిన్నావిడ పేపరు పట్టుకుంది. పెద్దావిడ చూడు... ఇంత లావు బయ్యిండు పుస్తకం... యాభై ఆదివారాలకి సరిపోతుందో ఏమో, ఎలా పట్టుకుందో! మీ నాన్నకి ఇప్పటి దాకా కాఫీ ఇవ్వలేదు. ఆయన వొకటే రుసరుసలు నా మీద" అంటూ చరిత్రంతా యాకరువు పెట్టేసింది.

ప్రసాద్ గుండె 'గుబేల్' మంది! "ఓరి దేవుడో! ఇవ్వాళేనా ఆదివారం? వీళ్ళిద్దరూ సమ్మె మొదలు పెట్టేశారా?" తమ్ముడి వేపు వోరగా కళ్ళు తిప్పితే అతగాడు అన్నగారిని భయంగా "ఇప్పుడెలాగ?" అన్నట్టు చూస్తున్నాడు.

'ఎలాగేవిటి? ఎప్పట్లాగే. ధైర్యంగా ఉండు!' అని అన్నగారు కళ్ళతోటే తమ్ముడికి ధైర్యం చెప్పి- 'వూఁ... ఆదివారం అయితే ఏవిటటా? ఇప్పటి దాకా కాఫీ లేదు, గీఫీ లేదు! నిద్రంతా చెడగొట్టింది!' అని రుసరుసలాడాడు.

అన్నపూర్ణమ్మ కొడుకుల్ని చూసి జాలిపడుతూ- 'చెప్పేది చెవినపెట్టరేవిట్రా? వాళ్ళిద్దరూ పనులు కట్టిపెట్టి కూచుంటే, ఇక మీరు కాకపోతే ఇంకెవరు చేస్తారూ? కంచే చేను మేసిందనీ గవన్నమింటే వాళ్ళ పక్షాన చేరితే ఇక మీరేం చెయ్యగలరూ? తొందరగా పనుల్లోకి దిగి ఏదో కాస్త వుడకేసి అయిందనిపించెయ్యండి నాయనా! ఆదివారం ఆదివారం మీకే చెర తప్పదు ఇక. ఏదో పుట్టింది ప్రెపంచానికి! ఆడవాళ్ళు పనులు మానేసి కుర్చీ లెక్కి కూచుంటే కొంపలో పిల్లా జెల్లా, ముసిలీ ముతకా, యామైపోతారూ?... హూ... ఏవిటో' అని స్వగతాలతో ముగించింది.

చిన్న కోడలు వెటకారంగా - 'ఏవీ అయిపోరు. ఆడవాళ్ళు కుర్చీ లెక్కినప్పుడు, మొగాళ్ళు కుర్చీలు దిగితే సరిపోతుంది'అని అత్తగారికి చక్కటి మార్గం చూపించింది.

"అందుకేగా అమ్మా! అలాగే చెయ్యమని చెప్పానుగా వాళ్ళకీ!"

ఎందుకన్నా మంచిదని అప్పటికే దూరంగా పోయి పచార్లు చేస్తోన్న ప్రసాద్, తమ్ముడి ఎడం చెవిలో- "అరేయ్! ఈసారి మనం ఈ గవర్నమెంటుకి ఓట్లు వెయ్యకూడదు. గుర్తుపెట్టుకుని అప్పుడు గుర్తుచెయ్యి నాకు" అని గుసగుసలాడాడు.

"అబ్బా, ఎప్పుడో ఓట్ల సంగతి ఇప్పుడెందు కన్నయ్యా! ఇప్పుడు మన పాట్ల సంగతి చూడు. అమ్మ కూడా ఇలా అయిపోయిందేవిటి?" అని బేలగా చూశాడు తమ్ముడు.

"మీ ఆవిడ, అత్తగార్ని బాగా బుట్టలో వేసింది. అయినా ఏం పర్వాలేదు. ధైర్యంగా వుండమన్నానా లేదా?" అని ప్రసాద్ సోదరుడికి కర్తవ్యం బోధించి, పైకి గట్టిగా "రాత్రి అర్ధరాత్రి దాకా ఈ అప్పా చెల్లెళ్ళిద్దరూ వాకిట్లో కూర్చుని గుడగుడలాడుకున్నారు, ఇందుకా? ఇప్పుడు మేం పనులు చెయ్యాలా?" అంటూ సూటిగా వ్యవహారంలోకి దిగాడు.

"ఎవడి కోసం?" అని, అంతకన్నా సూటిగా జవాబు చెప్పింది అరుణ. పైగా చకచకా ఆర్డర్లు జారీ చేసింది - "తక్షణం పాలపేకెట్లు లోపలికి తెచ్చి గిన్నెల్లో పోసి కాగబెట్టి ముందు మావయ్యకి కాఫీ ఇవ్వండి! తర్వాత మా అందరికీ కూడా కాఫీ లివ్వండి! తర్వాత వుప్మా చెయ్యండి! తర్వాత మళ్ళీ కాఫీ లివ్వండి రెండోసారి!"

కమల మధ్యలోనే అడ్డొచ్చి - "వుప్మా

# వారఫలాలు



## (30-10-96 నుండి 5-11-96 వరకు)

### గ్రహగతి

**సింహంలో కుజుడు, కన్యలో శుక్రరాహువులు, తులలో రవి బుధులు, ధనుస్సులో గురుడు, మీనంలో కేతువు, వక్రించిన శని, వృషభ మిథున, కర్కాటక, సింహాలలో చంద్రుడు సంచరిస్తారు.**

### మేషం

(చూ, చే, చో, ల అశ్వని - లీ, లూ, లే, లో భరణి - అ కృత్తిక 1 పా)

వారం పూర్వార్థంలో పలుకుబడి ఉపయోగించి కొన్ని కార్యాలు పూర్తి చేయవచ్చు. వృత్తి ఉద్యోగాలు రాణిస్తాయి. సంఘంలో గౌరవం లభిస్తుంది. శని, ఆది, సోమవారాలలో కుటుంబ సమస్యలున్నా మంగళ వారం పట్టుదలతో కృషిచేస్తే తలచిన పనులు పూర్తవుతాయి. బంధుమిత్ర సమాగమం సంభవం.

### వృషభం

(ఈ, ఊ, ఏ కృత్తిక 2, 3, 4 పా - ఓ, వా, వీ, వూ రోహిణి - వే, వో మృగశిర 1, 2 పా)

వారం పూర్వార్థంలో కుటుంబ సౌఖ్యం, భోజన సౌఖ్యం, ఆదాయం లభిస్తాయి. మాటలతో కార్యాలు పూర్తి చేయవచ్చు. సోమ మంగళ వారాలలో కుటుంబ విషయాలకు బంధుమిత్రులకు మితిమీరిన ఖర్చులు చేస్తారు. స్థిరాస్తి విషయాలు అనుకూలంగా ఉంటాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు.

### మిథునం

(కా, కీ మృగశిర 3, 4పా-కూ, ఖం,ఙ, చ్చా ఆర్ద్ర-కే,కో, హా పునర్వసు 1, 2, 3 పా)

బుధవారం ప్రయాణం నెర వేరు తుంది. గురు, శుక్రవారాలలో శుభ పుణ్యకార్యాలలో ఆసక్తి, వృత్తిలో ప్రోత్సాహం సంభవం కావచ్చు. శని, ఆది, సోమవారాలలో కుటుంబ సమస్యలు, బాధ్యతలు ఉన్నా మంగళ వారం కార్యాలు, వ్యవహారాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలు రాణిస్తాయి.

### కర్కాటకం

(హి పునర్వసు 4 పా- హు, హే, హో డా పుష్యమి-డీ, డూ, డే, డో ఆశ్లేష)

బుధవారం నిదానంగా కొన్ని కార్యాలు సాగించవచ్చు. గురు, శుక్ర వారాలలో ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆడంబరాలకు అధిక వ్యయం చేస్తారు. శని, ఆదివారాలలో బాధ్యతలున్నా వాటిని గౌరవ ప్రదంగా భరిస్తారు. సోమ, మంగళవారాలలో కుటుంబ సమస్యలున్నా ఆదాయానికి లోటుండదు. కాని వాగ్వాదాలకు దిగవద్దు.

### సింహం

(మా, మి, మూ, మే మఖ-మో, టా, టీ, టూ పుబ్బ - టే ఉత్తర 1 పా)

శుక్రవారం వరకు చేసిన ప్రయత్నాలు దారికి వస్తాయి. వృత్తి వ్యాపారాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శని, ఆదివారాలలో ప్రయాణాలు తిప్పట-అధిక వ్యయం

---

ఏవిటక్కయ్యా, నేనొప్పుకోను. ఇడ్లీ చెయ్యమను. ఏం, ప్రతీ ఆదివారం మనం ఇడ్లీ చెయ్యడం లేదూ?'' అని వుష్మాని తిరస్కరించింది.

"ఏదో ఈ మొదటి వారం ఆ మాత్రం చెయ్యనిద్దూ కమలా! నెమ్మదిగా వాళ్ళే నేర్చుకుంటారులే" అంది అక్కగారు కొంచెం నవ్వి.

''నువ్వెప్పుడే మెత్తబడి పోతున్నావేమిటక్కయ్యా?" అని ఆశ్చర్యపడింది చెల్లెలు.

"ఛఛ! నేనెందుకు మెత్తబడతానూ? మొదటి వారం కదా అని అన్నానంతే."

"సరేలే అయితే. వుష్మా ఈ వొక్కసారే. వొచ్చే సారి నించీ నేనొప్పుకోను" అని గట్టిగా తేల్చి చెప్పింది కమల.

అరుణ మళ్ళీ ఆజ్ఞలు సాగించింది. "ఆఁ... టిఫిన్ తర్వాత కూరల పని మొదలు పెట్టండి! బెండకాయ వేపుడూ, పప్పు చారూ కావాలి మాకు! మావయ్యకి తప్పకుండా రోటి పచ్చడి వుండాలి. బీరకాయ పచ్చడో, వంకాయ పచ్చడో చెయ్యండి! ఏదైనా ఇష్టంగానే తింటారు."

కమల వుత్సాహం వురకలు వేస్తోంటే-

"తర్వాత నేను చెపుతానుండు" అంటూ అడ్డొచ్చింది-

"ఆదివారాల్లో మధ్యాహ్నాలు కూడా ఏదన్నా టిఫెను వుండాలంటారుగా మీరే. గారెలకి పప్పు ఇప్పుడే నానబెట్టండి! కొబ్బరి కాయ పచ్చడి ఇప్పుడే చేసి పెట్టెయ్యండి! మధ్యాహ్నం 3 గంటలప్పుడు పప్పు రుబ్బి గారెలు వేడివేడిగా వేసి ఇవ్వండి అందరికీ."

కమలకి అరుణ అడ్డొచ్చింది- "సాయంత్రం వంట సంగతి అప్పుడే చెపుతాంలెండి. ఇప్పుడు చెప్తే మరిచేపోతారు."

"బట్టల సంగతి చెప్పవేం అక్కయ్యా? బుట్టెడు గుడ్డలున్నాయి. అన్నీ నానబెట్టి వుతకండి! రంగు బట్టలూ తెల్లబట్టలూ కలపకూడదు. వేరు వేరుగా నానబెట్టాలి. జాకెట్లూ, చీరలూ కలపకూడదు. వంట అవగానే బట్టల పని చేసెయ్యండి! లేకపోతే సాయంత్రానికి తొందరగా ఆరవు"

అరుణ అందుకుంది- "ఇవ్వాళ లక్ష్మిరాదు బహుశా. నిన్న జ్వరంతో వొస్తే తగ్గే దాకా రావొద్దని చెప్పాం. బట్టలపని అవగానే అంట్లు తోమి సర్దెయ్యండి"

మళ్ళీ కమల అందుకుంది- "అంట్లపని అవగానే గదులూ వాకిళ్ళూ సుభ్రంగా వూడ్చెయ్యండి! లక్ష్మి మానేసినప్పుడల్లా ఈ పనులన్నీ మేమే చేసుకుంటాం"

ప్రసాద్ అంతసేపూ పళ్ళు నూరుతూ నూరుతూ పళ్ళన్నీ కదలగొట్టుకున్నాడు- "ఈ పనులన్నీ మేం చేస్తోంటే మరి మీరేం చేస్తారు?" అన్నాడు చెదిరిపోయి బెదిరిపోతోన్న పళ్ళతో.

"వినాలని ఉందా? ఈ పనులన్నీ రోజూ మేం చేస్తోంటే మీరేం చేస్తూ వుంటారో అదే ఇవ్వాళ మేం చేస్తాం" అంది చేతులు తిప్పుతూ కమల, నదురూ బెదురూ లేకుండా.

అరుణ అందుకుంది- "రోజూ ఇద్దరు ఆడవాళ్లు చేసేపనే ఇవ్వాళ ఇద్దరు మొగాళ్ళు చేస్తారు. అంతే. అంతకన్నా ఏం కాదు. కదే కమలా?"

ప్రసాదు పళ్ళు వూడినా సరే గట్టిగా ఎదురు తిరగదల్చుకున్నాడు- "రోజూ మీరు మాత్రం ఇన్ని పనులు చేస్తున్నారా? వుదాహరణకి- బట్టలే తీసుకుందాం. ఒక్క రోజుకి గంపెడు గుడ్డలు ఎలా చేరాయి? 3 రోజుల్నించీ వుతక్కుండా మురగ బెట్టి మాకు అప్పజెపుతారా?" అని పాయింటు తీశారు.

"కావాలంటే అన్నీ తీసి లెక్కలు చూసుకోండి. అన్నీ నిన్న విడిచిన బట్టలే. కాకపోతే దుప్పట్లు మిగల మాశాయని నాలుగు దుప్పట్లు కూడా పడేశాం" అన్నారు అక్కచెల్లెళ్ళు.

వాసు కూడా పోరాటంలోకి దూకాడు "ఏం, అంత మిగలమాసేదాకా వుతక్కుండా ఎందుకు

ఉండవచ్చు. సోమ, మంగళవారాలలో ఆవేశాలను అదుపు చేయాలి. పట్టుదలతో కార్యాలు నిర్వహించవచ్చు.

## కన్య

(టో,పా, పే ఉత్తర 2, 3, 4 పా-పూ, షం, ణా, ఠా హస్త-పే, పో చిత్త 1, 2 పా )

నిదానంగా ఆలోచనలు కార్య రూపం ధరిస్తాయి. వారం పూర్వార్థంలో ముఖ్య వ్యవహారాలు గౌరవ ప్రదంగా నిర్వహించవచ్చు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు లాభిస్తాయి. సోమ, మంగళవారాలలో ప్రయాణాలు వద్దు. ఖర్చు అదుపు చేయాలి. సొమ్ము పొదుపు చేయాలి. తిప్పట- అలసట ఉండవచ్చు.

## తుల

(రా, రీ చిత్త 3, 4 పా-రూ, రే, రో తా స్వాతి-తీ, తూ, తే విశాఖ 1, 2, 3 పా)

బుధవారం ప్రయాణాలు. తిప్పట, వేళ తప్పిన ఆహార విహారాలు ఉంటాయి. గురువారం నుండి ఆలోచనలు కార్యరూపం ధరిస్తాయి. ముఖ్య వ్యవహారాలు ఈ వారాంతం లోగా నిర్వహించి మంచి ప్రయోజనం పొందవచ్చు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు లాభిస్తాయి. విందులు-కాలక్షేపాలకు లోటుండదు.

## వృశ్చికం

(తో విశాఖ 4 పా-నా, నీ, నూ, నే అనూరాధ-నో, యా, యీ, యూ జ్యేష్ఠ)

శుక్రవారం లోగా ప్రయాణాలు కలసి వస్తాయి. వేళ తప్పిన ఆహార విహారాలు అలసటకు గురి చేయవచ్చు. శని, ఆదివారాలలో తలచిన పనులు క్రమంగానూ, సోమ, మంగళ వారాలలో చురుకుగానూ సాగుతాయి. తొందరలున్నా చికాకు పడ వద్దు. దీక్షతో కృషి చేస్తే వృత్తి ఉద్యోగాలు రాణిస్తాయి.

## ధనుస్సు

(యే, యో, బా, బీ మూల- బూ, థా, భా, ఢా పూర్వాషాఢ- బే ఉత్తరాషాఢ 1 పా)

క్రమంగా ప్రయాణాలు ఆలోచనలు కలిసివస్తాయి. ముఖ్య వ్యవహారాలను ఆదివారంలోగా పూర్తి చేయండి. వృత్తి ఉద్యోగాలలో మంచి ప్రోత్సాహం లభిస్తుంది. శుభ పుణ్య కార్యాలలో విందులలో సమావేశాలలో పాల్గొంటారు. సోమ, మంగళవారాలలో ఇంటా బయటా సమస్యలుంటాయి. ఓర్పు చూపాలి.

## మకరం

(బో, జా, జీ ఉత్తరాషాఢ 2, 3, 4 పా- జూ, జే, జో, ఖా శ్రవణం-గా, గీ ధనిష్ఠ 1,2 పా)

పట్టుదలతోను, తెలివితేటలతోనూ కృషి చేసేవారికి అపజయం ఉండదు. వ్యవహారాలను కొంతకాలంపాటు మధ్యవర్తికి వదలడం మంచిది. ఆదివారం వరకు చేసే ప్రయత్నాలకు తిరుగుండదు. వృత్తి ఉద్యోగాలు రాణిస్తాయి. వారాంతంలో కుటుంబ ఆరోగ్య సమస్యలు- బంధు మిత్రుల బాధ్యతలు ఉండవచ్చు. ప్రయాణాలు వద్దు.

## కుంభం

(గూ,గే ధనిష్ఠ 3, 4 పా-గో, సా,సీ, సూ శతభిషం- సే, సో, దా పూర్వాభాద్ర 1,2,3 పా)

శుభ పుణ్య కార్యాలను నిర్ణయించి త్వరలో పూర్తి చేయడం మంచిది. బంధు మిత్రుల సహకారం లభిస్తుంది. పట్టుదలతో కార్యాలు, వృత్తి వ్యవహారాలు నిర్వహించి తగిన ఫలితం పొందవచ్చు. వారాంతంలో జలుబు, దగ్గు, జ్వరం వంటి బాధలకు లోనయ్యే సూచనలున్నాయి.

## మీనం

(దీ పూర్వాభాద్ర 4 పా- దు, శ్యం, ఝా, ఉత్తరాభాద్ర- దే, దో, చా, చీ రేవతి)

బంధు మిత్రుల బాధ్యతలు భరించాలి. అయితే వృత్తి ఉద్యోగాలలో మంచి ప్రోత్సాహం వారంతంలోగా లభిస్తుంది. ముఖ్య వ్యవహారాలు పరిష్కరించుకునే అవకాశాలున్నాయి. కొంత పట్టుదల చూపాలి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ చూపాలి.

దైవజ్ఞరత్న
**తొయ్యేటిభానుమూర్తి**



వుంచారు? ఎలాగా మాసేశాయిగా? ఇవ్వాళ వుతక్కపోతే మాత్రం ఇంకేం మాస్తాయి? అవన్నీ రేపు మీరే వుతక్కోండి!" అని అరిచాడు.

కమల, వాలు జడని గట్టిగా ముడిపెట్టేసి, యుద్ధ రంగంలో దూకుతూ ముందుకొచ్చింది- "ఓహో! ఇవ్వాళ వుతకడం ఎగ్గొట్టి మళ్లీ మాకే అప్పజెప్పాలని చూస్తున్నారా? అంత తెలివి తక్కువ వాళ్ళం కాదు. ఇవ్వాళ పనులన్నీ ఇవ్వాళే అయిపోవాలి"- అని అరిచింది.

అన్నపూర్ణమ్మ నెత్తీనోరూ కొట్టుకుంటూ- "ఆ గుడ్డల గోల ఎందుకర్రా ఇప్పుడూ? ఎప్పుడో వుతుక్కోవొచ్చు. అవేమన్నా కూడదుగుతున్నాయా, నీళ్ళడుగుతున్నాయా? ముందు మీ నాన్నకి కాఫీ సంగతి చూడండీ" అని గోల పెట్టింది.

ఆ యుద్ధ భీభత్సంలో 'చిన్ని' ఒక్కడే తక్కువ అప్పటి దాకా. వాడు కూడా లేచి రావడంతో ఆ లోటూ కూడా తీరిపోయింది. "అమ్మా... అమ్మా' ' అంటూ వాడు ఏడ్చుకుంటూ వొచ్చి తల్లిని కావిలించుకున్నాడు.

"లేచావా నాన్నా?" అని అరుణవాణ్ణి దగ్గిరికి తీసుకోబోయి ఆగింది.

"అమ్మా!... దొడ్డికొస్తోందే... తీసికెళ్ళూ... అమ్మా!.... తీసికెళ్ళూ"

"ఇవ్వాళ ఆదివారం కదమ్మా! ఆడవాళ్ళకి సెలవురోజు. నేను ఏ పనీ చెయ్యనుగా నాన్నా?"

'ఆదివారం కూడా దొడ్డి కొచ్చేస్తోందే అమ్మా!' అంటూ చిన్నిగాడు కాళ్ళు భూమి మీద ఆన్చకుండా నిప్పులు తొక్కడం మొదలెట్టాడు.

"నాన్నని తీసికెళ్ళమనమ్మా!" అని అరుణ కుమారుడికి సలహా ఇచ్చి, తను కూడా భర్తగారికి ఆ మాట చెప్పింది- "మిమ్మల్నే... వింటున్నారా? వీణ్ణి దొడ్డోకట... తీసుకెళ్ళండి! లేకపోతే ఇక్కడే కూచుంటాడు... తర్వాత మీరే ఎత్తాలి."

ప్రసాద్ వొకటే ఆశ్చర్యపడిపోతూ- "ఏవిటీ, నువ్వు పిల్లాడి పని కూడా చెయ్యవా? అదీ ఇంటి పనేనా?" అని కొరకొరా చూశాడు.

అరుణకించిత్తు కూడా బెదరకుండా- "ఆఁ... అదీ ఇంటిపనే. ఇవ్వాళ నేను ఏ పనీ చెయ్యను" అని మళ్ళీ చెప్పేసింది.

"చిన్ని నీ పిల్లాడు కాడా?" అని భర్తగారు రెట్టించాడు.

"ఆరు రోజులే, నా పిల్లాడు. ఆదివారం నా పిల్లాడు కాడు" అని భార్య కూడా రెట్టించింది.

పిల్లాడి మేనత్త ముందుకొచ్చి, "నేను తీసికెళ్తాను రారా! తొందరగా రా!" అని పిల్లాణ్ణి ఆహ్వానించింది.

వదినగారు కోపంగా- "రేఖా! నువ్వు తీసికెళ్ళ డానికి వీల్లేదు. ఆడవాళ్ళందరం ఒక కట్టుగా వుండాలని చెప్పలేదూ?" అని అరిచింది.

"నాన్నా, తొందరగా రానాన్నా!" అని పిల్లాడు తండ్రి ముందు గంతులేశాడు, దొడ్డికని నిగ్రహిస్తూ.

"సరే, చిన్నిగాడి దొడ్డిగోల కాబట్టి, ఈ ఒక్కపనే చేస్తాను. ఇంకో పని చేస్తానేమో చూడండి" ప్రసాదు భీకర శబధం చేసి కదిలాడు. - "పద వెధవా! అర్ధరాత్రి దాకా మింగుతూనే వుంటావు. లేచీ లేవగానే మొదలుపెడతావు. ఈసారి నించీ ఆదివారాలు కూడా 'దొడ్లోకి' అను, చెపుతాను. తొడ పాశం పెట్టకపోతే అప్పుడు చూడు!"

వెనకనించీ అరుణ కోపంగా హెచ్చరికలు చేసింది- "ఇదుగో, వాణ్ణి అలా విసుక్కుంటూ తీసికెళ్తే నేనొప్పుకోను. పిల్లల్ని పెంచడం అంటే అలాగేనా విసుక్కోడాలూ కసరు కోడాలూనా? రోజా నేను అలాగే పెంచుతున్నానా?"

"సరే, సరే, అలాగేలే. ముద్దులు పెట్టుకుంటూ దొడ్లోకి తీసికెళ్తాలే" అని వాగ్దానం విసిరాడు ప్రసాద్.

అప్పటికే వేణూ పాల సంచులు లోపలికి తీసుకుపోయి కాఫీ కార్యక్రమం మొదలు పెట్టేశాడు. తండ్రికి కాఫీ ఇచ్చి, టాబ్లెట్ ఇచ్చాడు. మిగిలిన అందరికీ గ్లాసుల్లో పోసి తెస్తూ- "కాఫీ! కాఫీ!" అని అరుస్తూ వొచ్చాడు. 'నేను మొగాడినే కాబట్టి నేను చెయ్యొచ్చు.... పెద్దొదినా, తొందరగా తీసుకో! చిన్నొదినా, నువ్వు కూడా! వాసన్నయ్యా, నువ్వూ?'

> దాదాపు ఇరవై ఏళ్ల కిందట, ఏలూరు ప్రాంతంలో, నక్సలైట్ వుద్యమంలో వుండిన ఒక విద్యార్థి, "అమ్మకి ఆదివారం లేదా?" అనే పేరుతో ఒక 'కరపత్రం' రాశాడని, పదేళ్ల కిందట విన్నాను. ఆ కరపత్రం కోసం ప్రయత్నించాను గానీ దొరకలేదు. అందులో విషయం ఏమిటో నాకు తెలీదు. ఆ విద్యార్థి పేరు కూడా తెలీదు. అప్పటి నుంచీ నాకు ఆ పేరుతో నేను చెప్పదల్చుకున్న విషయంతో 'కథ' రాయాలని వుంది. అది ఇప్పటికి అయింది. ఈ కథ పేరు - ఆ విద్యార్థి పెట్టిందే.
>
> రంగనాయకమ్మ

అంటూ పేరు పేరునా అందరికీ గ్లాసులు అందించాడు.

"బతికించావురా భగవంతుడా!" అని వాసు ఆత్మలో ఒక దణ్ణం పెట్టుకున్నాడు.

కమల కాఫీ సువాసనలు పీలుస్తూ- "వేణూ! కాఫీ చేస్తే చేశావు గానీ, మిగతా పనులేవీ నువ్వు చెయ్యడానికి వీల్లేదు. నీకు వీలైనప్పుడల్లా చేస్తూనే వుంటావు కాబట్టీ, నువ్వ కూడా మాలాగే సెలవు తీసుకోవాలి. తెలిసిందా?'' అని మరిదిని హెచ్చరించి- భర్తగారితో- "ఇదిగో, వాసుదేవరావు గారూ! కాఫీ తాగడం అయ్యాక, వుప్మాపని మొదలు పెట్టండి'' అని ఆజ్ఞాపించింది.

"ఆఁ... సరిగ్గా అదే అనుకుంటున్నా ఇప్పుడు. నీకు వుప్మాలో అల్లం నచ్చుతుందా లేదా అని ఆలోచిస్తున్నా" అని వాసుదేవరావు కమలాదేవి మీద వీలైనంత వెటకారం గుమ్మరించాడు.

కమల ధీమాగా- "సరే! నేను చెప్పవలసింది చెప్పానూ. చెయ్యకపోతే అప్పుడే చూద్దాం''- అని వేలు ముడి ఎగరేసింది.

"ఏం చేస్తారేమిటి?''

"ఏం చేస్తామో అప్పుడే తెలుస్తుంది.''

"ఎప్పుడూ?''

"తమరు ఇంకా ఇక్కడే వేళ్ళాడినప్పుడు''

వాసుకి కొంచెం బెదురు ఎక్కువే- "అరేయ్ వేణూ! ఈ వుప్మాలా గిప్మాలూ నావల్ల కాదు గానీ, ఒక పని చెయ్యి! మనం ఎంత మంది వున్నాం? లక్ష్మితో కలిసి 10 మంది కదా? 10 ప్లేట్ల వుప్మా, 10 ప్లేట్ల ఇడ్లీ తెచ్చెయ్యి! ఇదుగో, వంద రూపాయలు సరిపోతాయా? ఇక్కడున్నట్లు రావాలి' ' అని వంద నోటు కోసం చొక్కా జేబులో చెయ్యి పెట్టాడు గానీ అక్కడేమీ దొరకలేదు.

అన్నపూర్ణమ్మ సమయోచితంగా మళ్ళీ లబలబలాడింది- "అయ్యో, అయ్యో, టిఫిన్లకి వంద రూపాయలు పెడతారా? తర్వాత భోజనాలకి వెయ్యి రూపాయలా అయితే? వొక్క ఆదివారంతోటే కొంప గుండం చేసేస్తారా ఏవిట్రా?" అని చిన్న కోడల్ని బేలగా చూస్తూ- "అమ్మా కమలా! ఆ రూపాయలు మీరే తీసుకుని... ఏ జాకెట్టు గుడ్డలో కొనుక్కోవొచ్చు... ఆవుప్మాయేదో మీరే చేసెయ్యరాదామ్మా?" అని సలహా ఇచ్చింది.

కమల ఎగిరి కంట్లో పడినంత పని చేసి- "ఛీ ఛీ! డబ్బు తీసుకుని వంట మమ్మల్నే చెయ్యమంటారా?" అని అరిచింది. అంతలోనే చప్పున చల్లబడి- "మీరేం కంగారు పడకండి అత్తయ్యా! హోటల్లో కొని తెస్తే మేం వొప్పుకోం. రోజూ మేం కష్టపడి చెయ్యడం లేదూ? వాళ్ళూ అలాగే చెయ్యాలి" అంది.

"వాళ్ళే చేస్తారో, కొనే తెస్తారో ఎలా చేస్తే మనకెందుకు కమలా?" అంది అక్కగారు.

కమల మొహం చాటు చేసి- "వాళ్ళ డబ్బు వొకటీ, మన డబ్బు వొకటీనా అక్కయ్యా?" అని గుసగుసలాడింది.

"నీ పిచ్చిగానీ వాళ్ళ దగ్గిర అసలు డబ్బెక్కడుంది? ఇద్దరి జీతాలూ కలిపి తిప్పి తిప్పి కొడితే 4 వేలన్నా వుండదు. ఎన్నాళ్ళు కొంటారో అదీ చూద్దాం" అంది అక్కగారు.

కమలకి కూడా 'అదీ చూద్దా'మనిపించింది. "మరి అదేదో తొందరగా తెప్పించండి! అప్పుడే 8 కావస్తోంది. మేమైతే, 7 గంటలకే వేడి వేడిగా అందించడం లేదూ?" అని గంటల లెక్కలు చెప్పింది.

చిన్నివొచ్చి మళ్ళీ తల్లిని పట్టుకున్నాడు. "అమ్మా... ఆకలేస్తోంది... ఏవన్నా పెట్టు... అమ్మా... ఏవన్నా పెట్టు..." అని చేతులు పట్టుకుని వేళ్ళాడాడు.

అరుణ అనునయంగానే- "మళ్ళీ నా దగ్గిర కెందుకొచ్చావు నాన్నా? ఇవ్వాళ ఆదివారం అని చెప్పాను కదా?'' అని గుర్తు చేసింది.

"ఆదివారం కూడా ఆకలేస్తోందిగా?''

"ఆ సంగతి మీ నాన్నకి చెప్పు. నిన్ను ఇవ్వాళనాన్నే పెంచాలి. మళ్ళీ రేపటి నించీ నేను పెంచుతాను."

"వూహూఁ... నాన్నవొద్దు. నువ్వే పెంచు నన్ను. తొడపాశం పెడతాడంట!"

"చూశావా, పిల్లాడెంత బెదిరిపోయాడో!" అని అరుణ తోడి కోడలివేపు సానుభూతి కోసం, మళ్ళీ పిల్లాణ్ణి బుజ్జగించింది- "నాన్న నిన్నేమన్నా అంటే నేనూరుకుంటానా? పోట్లాడనూ?.... బంగారు కొండవి కదా? చెప్పినట్టు వినాలి! అమ్మకి ఆదివారం అక్కరలేదా, నువ్వే చెప్పు! ఇవ్వాళ్ళ నాన్న తోటే నీళ్ళు పోయించుకో. నాన్నతోటే అన్నం పెట్టించుకో. అన్నీ నాన్న తోటే! సరేనా?''

''వూహూఁ.... నాయనమ్మతో చేయించుకుంటా"


"వొద్దమ్మా! నాయనమ్మకి కూడా సెలవే కదా? ... ఏం, నాన్న దగ్గిరికే వెళ్ళు"

చిన్నిగాడు బిక్కమొహంతోటే నాన్న దగ్గిరికి నడిచాడు- ""నాన్నా! ఆకలేస్తోంది నాన్నా! యావన్నా పెట్టు!"

"మాబాబే, మానాయునే! లడ్డుండలు పెడతానమ్మా! చేస్తానుండు!... ఆకలట, ఆకలి! దిగుమతి అయ్యిందిగా ఇక ఎగుమతీ!" అని చిన్ని మీద కళ్ళెర్రజేశాడు తండ్రిగారు.

అరుణ- "అలా వాణ్ణి వెటకారాలు చెయ్యొద్దని చెప్పానా లేదా?'' అని కోపంగా అడిగింది.

(సశేషం)



## రంగనాయకమ్మ

# అమ్మకి ఆదివారం లేదా?

(క్రిందటి సంచిక తరువాయి)

**"నా ఇష్టం! నేను పెంచేటప్పుడు నా ఇష్టం వొచ్చినట్టు పెంచుతాను. తిడతాను. కొడతాను. గోడకుర్చీలు వేయిస్తాను. నానా చిత్రహింసలూ పెడతాను. అదంతా నా ఇష్టం. నా పెంపకం నీకు నచ్చకపోతే నువ్వే పెంచుకో" అని జవాబు చెప్పాడు ప్రసాద్.**

"ఓహో! మీ ఎత్తు తెలిసింది! సరే, అలాగే పెంచండి! ఎవరి పెంపకం బాగుందో వాడే గ్రహిస్తాడు. అలాగే పెంచండి!" అని దానికీ సిద్ధపడింది అరుణ.

"రారా చిన్నా, పాలు తాగుదువుగాని నే నిస్తాను రా" అని మళ్ళీ ముందుకొచ్చింది మేనత్త, పిల్లాణ్ణి చూడలేక.

"రేఖా! ఎన్నిసార్లు చెప్పాలి నీకు?" అని వదిన గార్లిద్దరూ చెరో పక్కనించీ అరిచారు.

అన్నపూర్ణమ్మ, తన ప్రాతని మరిచిపోకుండా- "ఇదుగో ఇదీ వరస, తెల్లారిందగ్గిర్నించీ!.... నాయనా వేణూ! సైకిలు మీద తొందరగా వెళ్ళి అదేదో తెచ్చి పడెయ్యి! పిల్లాడు వేళ్ళాడిపోతున్నాడు. మీ నాన్న కూడా ఎక్కువ సేపు వుండలేరు" అని చిన్న కొడుకుని తొందర చేసింది.

వేణు మళ్ళీ లేచి వంటింట్లోకి సిద్ధమవుతూ "వుప్మా కూడా నేనే చేసేస్తాలేమ్మా! మిగతావన్నీ అన్నయ్యలు చేస్తార్లే... పెద్దొదినా! చిన్నొదినా! మిమ్మల్ని చూస్తే ఎంత నవ్వొస్తోందో!" అని మొహం మీద నవ్వు మెరిపించాడు.

"ఎందుకటా అంత నవ్వు?" అని రుసరుస లాడారు వదిలిద్దరూ.

"ఎంత నమ్మకమో కదా మీకు 'చట్టాల' మీద?"

"చట్టాల్ని కాకపోతే దేన్ని నమ్ముతాం?"

"వరకట్నం చట్టం పని చెయ్యడం ఒక్క కేసులో నన్నా చూశారా?"

"అందుకని ఆ చట్టమే వొద్దంటామా?"

"అసలు చట్టం అంటే, ఏ పనికి చట్టం సాధ్యమో ఏ పనికి కాదో, ఆ తేడాయే లేదా మీకు? పని చెయ్యడానికి సాధ్యమే కాని చట్టాలు వుంటే, వాటివల్ల ఏమిటి ప్రయోజనం?"

"అంత సాధ్యమే కాని చట్టాల్ని గవర్నమెంటు ఎందుకు చేస్తుంది? చట్టం అంటూ వుంటే, ఎంత పనికిమాలిన చట్టానికైనా దాని విలువ దానికి ఉంటుంది."

"సరే, సరే. నేను వుప్మా చేసుకోవాలి బాబూ!" అనేసి వేణూ వదినగార్లతో వాదం కట్టిపెట్టి వంటింట్లోకి పరిగెత్తాడు.

అరుణ, భర్తగార్ని పిలుస్తూ - "ఇదుగో మిమ్మల్నే. వంటకి ఆలస్యమైపోతోంది. మీరు వెళ్ళి బెండకాయలు తరుక్కోండి!" అంది.

"నేనా? బెండకాయాలా? నే నింతవరకూ బెండకాయ కూర తప్ప బెండకాయలు చూడనే లేదు. గుండ్రంగా గచ్చకాయల్లా వుంటాయి. అవేనా బెండకాయాలంటే?"

"గచ్చకాయ లెప్పుడు చూశారు?"

"చిన్నప్పుడు చూశాలే!"

"సరే, వంటింట్లో బుట్టలో వున్నాయి బెండకాయలు. చూడండి."

"అలాంటి ఆశలు పెట్టుకోకు నా మీద!"

అరుణ తెల్లగా తెల్లబోయింది. "మరి మేం సెలవు తీసుకోవొద్దా?"

"తీసుకోండీ. ఎవ రొద్దన్నారూ? మహారాణుల్లా తీసుకోండి!"

"మరీ మీరు పని చెయ్యొద్దా?"

"చెయ్యం! చెయ్యం! చెయ్యం!"

"మీరు పని చెయ్యకపోతే మేం సెలవు తీసుకోడం ఎలాగ?"- కమల సూటి ప్రశ్న.

"ఏమో, ఎలాగో! మమ్మల్నడిగితే మేమేం చెపుతాం? మీ సెలవు పప్పులు మా దగ్గిర వుడకవ్."

"మా సెలవు పప్పులా?"

"ఆఁ... సెలవు పప్పులే. అంతేకాదు. చుట్టం పప్పులు కూడా!"

"ఆఁ.. చట్టం పప్పులు కూడానా?"

"ఆఁ... దేని పప్పులూ మా దగ్గిరవుడకవ్. ఆదివారం లేదు, గీదివారం లేదు. సెలవు లేదు, గిలవు లేదు. రోజూలాగే... మీరే... చక్కగా పనులన్నీ చేసుకోండి! కావాలంటే సాయంత్రం సినిమాకి వెళ్దాం!"

తోటికోడ ళ్ళిద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ వుండిపోయారు. ఎవరికీ నోట మాట లేదు.

"పూర్ణక్కయ్యా!... అరుణా! వాసూ! ప్రసాద్!... అరె, వొక్కరూ పలకరే!" అంటూ ప్రవేశించాడు హనుమంతరావు. దాదాపు నలభయ్యేళ్ళ వయసు వుంటుంది. పంచెకట్టూ, చొక్కా, పైపంచీ, వేళ్ళకి వుంగరాలూ, బుగ్గన వక్కపొడీ! పెళ్ళిళ్ళకీ, విందులకీ, వుత్సవాలకీ బయట వంటలు చేస్తూ వుంటాడు. అదే ఆయన ప్రధాన వృత్తి. "అందరూ ఇలా నించున్నారేమిటి? ఫోటో తీయించు కుంటున్నారా?"

"రా మావయ్యా! మంచి టైంకే వొచ్చావు" అని మొదట ప్రసాద్ ఆహ్వానం పలికాడు.

"మంచి రసకందాయంలోనే వొచ్చావు హను మంతూ" అంది అన్నపూర్ణమ్మ.

"రసకందాయం ఏమిటి? ఏవన్నా పాయసం చేస్తున్నారా?" అని సంతోషించాడు హనుమంతు.

"ఎవరూ చేసేదీ? ఆడవాళ్ళు పనులు కట్టిపెట్టి కూచున్నారు. మొగాళ్ళు 'మేం అంతకన్నా చెయ్యం-అంటున్నారు. ఇంకెవరూ చేసేదీ?" అని దీర్ఘం తీసింది అన్నపూర్ణక్కయ్య.

"సరిపోయింది. అయితే ఇక్కడా మాకతే నడుస్తోం దన్న మాట!" అని వుసూరుమన్నాడు హనుమంతు.

"అంటే? మీ ఇంట్లోనూ ఈ కతేనా?"


"సరిగ్గా ఈ కతే. ఇవ్వాళ ఆడవాళ్లకి సెలవు రోజట కదా? చీకట్నే లేపేసి చావగొట్టి చెవులు మూసింది. తను ఏపనీ ముట్టుకోదట! నేను మొదట అల్పాహారం చేసి, తర్వాత పూర్ణాహారం చేసి, అటెనక ఆవిడ చీరలు కూడా వుతికి... అవన్నీ చెయ్యాలట! ఇప్పటి దాకా వాదించి వాదించి 'సరే, వొస్తానుండు' అని ఇలా తప్పించుకొచ్చా. పూర్ణక్కయ్యా! ఎన్నడన్నా విన్నామా? ఆఫీసులకీ, కంపెనీలకీ సెలవు లుంటాయి గానీ ఇంట్లో పనికి సెలవేమి టక్కయ్యా?"

"అవుననుకో, పోనీ వంట చేతనైనవాడివేగా? నీ చేతిలో పనీ. ఏదో అడిగింది. చేసెయ్యక పోయావా?... మావాళ్ళంటే, పని చేతగాక మిడుకుతున్నారుగానీ..." అని పూర్ణక్కయ్య తనకు




తోచిన సబబు తను చెప్పింది.

"అదేం టక్కయ్యా! పెద్ద దానివి. నువ్వు కూడా అలాగంటావు? బైట వంట చేస్తాను కదా అనీ ఇంట్లో ఆడదాన్ని కూర్చోబెట్టి వంట చెయ్యనా? ఏ రోగమో రొష్టో వొస్తే తప్పదు ఆనీ..."




'అది కాదయ్యా! ఆ గవన్నమింటింగు వాళ్ళేదో అన్నారని వీళ్ళందరికీ తిక్క రేగింది. రొండు వారాల పాటు మాట్లాడకుండా వొండి పడేస్తే వాళ్ళకీ ఆ పట్టుదల పోతుంది. తర్వాత వాళ్ళే దారికొస్తారు. ఈ చట్టాలూ పిట్టాలూ ఎల్లకాలం సాగుతాయా? పోనీ కాఫీ అన్నా కాచి పెట్టావా?' అంటూ అన్నపూర్ణమ్మ కాఫీ క్షేమ సమాచారా లడిగింది.

"అమ్మో! రొండు వారాలు వొండితే, ఇదే బాగుంది, ఇలాగే చెయ్య'మంటారు. నువ్వెన్ని చెప్పు అక్కయ్యా! ఇంట్లో వంటా వార్పూ ఆడవాళ్ళ నాజూకు చేతుల్తో చేస్తే అదెంత అందం! వంటింట్లో ఆడవాళ్ళు తిరిగితేనే ముద్దూ ముచ్చటా! ఎక్కడ వుండవలసిన వాళ్ళు అక్కడ వుండాలి!" అంటూ హనుమంతు తన కోసం ఒక కుర్చీ సంపాదించుకుని తొందరగా కూర్చున్నాడు.

కమల వెటకారంగా నవ్వి-"ఓహోహో! బాబాయిగారూ! మీ చేతుల్తో పొయ్యి మీద పప్పు పెడదాం, పదండి. వుడుకుతుందో, లేదో చూద్దాం" అంది.

"ఎందుకు వుడకదులే. పప్పుని తీసుకుపోయి నిప్పుల మీద పడేస్తే.... దాని ప్రాణం ఎంతా, వుండక్క చస్తుందా?" అని వుడుకుతుంది లెమ్మని హనుమంతే వొప్పేసుకున్నాడు.

"మరిహనేం? మొగాళ్ళ చేతుల్తో కూడా అన్నీ వుడుకుతాయి. ఆడవాళ్ళే వంటలు చెయ్యాలని రూలేమిటి?" అని పాయింటు తీశారు తోటి కోడళ్ళు.

"అబ్బా, రూలు కాదర్రా! వంట పని ఆడపిల్లలకి చప్పున పట్టుపడుతుంది. మొగాళ్ళకి ఎంతకీ వొచ్చి చావదు"-అని హనుమంతు మరీ వెనక్కిపోయి ఇక్ష్వాకుల వాదం తీసుకొచ్చాడు.

అక్కచెల్లె ళ్ళిద్దరూ దాన్ని చాలా తేలిగ్గానే ఎగరగొట్టారు-"ఆడపిల్లలు అమ్మల కడుపుల్లోంచి వంట గిన్నెలతోటే పుట్టుకొచ్చారా? మీరెలా పుట్టారో మేమూ అలాగే పుట్టాం. పుట్టాకే నేర్చుకున్నాం. నేర్చుకుంటే ఏ పని అయినా వొస్తుంది. ఏ వయసులో అయినా వొస్తుంది" అనేశారు వాళ్ళు గబగబా.

"అమ్మాయ్! మీరిలా ఈకకి ఈకా తోకకి తోకా పీకి మాట్లాడితే, ఆడవాళ్ళ అందమే పోతుంది... మొగాళ్ళు కూడా వొండితే వొండుతారేమో గానీ ఆడవాళ్ళు వొండినప్పుడు వుండే ఆ రుచీ... ఆ పరిమళం... ఆ అందం... అవన్నీ వుండేడుస్తాయా?" అన్నాడు హనుమంతు కొత్త పాయింటు తెచ్చాననుకుంటూ.

ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని రేఖకి కూడా వాదన వేసుకోవాలని సరదా పుట్టింది-"అదేవిటి మావయ్యా! 'నలభీమ పాకం' అని మొగాళ్ళ పేర్లతోటే చెపుతారుగా? పెళ్ళిళ్ళకీ వాటికీ మొగాళ్ళే వొండుతారుగా? హోటళ్ళలో, స్వీటు షాపుల్లో ఎవరు వొండుతున్నారు? ఇళ్ళలో కన్నా అవే ఎంతో రుచిగా వుంటాయి. కావాలంటే ఎవరినన్నా అడుగు" అంది నవ్వుతూ.

"సరిగ్గా మీ అత్తయ్య కూడా ఇలాగే వాద నేసు కుంది. మొగాళ్ళ వంటలే రుచిగా వుంటాయంది."

"నే నలా అనడం లేదు. 'మొగాళ్ళ వంటలు రుచిగా వుండవు' అంటే, అది తప్పంటున్నాను. సరిగా నేర్చుకుని సరిగా చేస్తే ఎవరు చేసినా రుచి వొస్తుంది. మనిషి మనిషికీ తేడా వుంటే వుండొచ్చు. అది వేరనుకో."

"అబ్బా! రుచి సంగతి కాదమ్మా, ఒక్క మాట చెపుతా వినండి! 'భారత సంస్కృతి' అనే మాట ఎప్పుడన్నా విన్నారా? దాని గొప్పతనం గురించి ఎప్పుడన్నా చదివారా? ఆడవాళ్ళంటే... అణకువగా... వినయంగా... ఒద్దికగా...ఆఁ... ఆలా వుంటే అందంగానీ.... 'నువ్వెంత అంటే నువ్వెంత' అనుకుంటూ, 'డీ, బబ్బా' మని ఎదురు తిరిగితే అదో గొప్పా? ఏబ్బే, ఏవిటో మీరూ..." అని అసలు వుద్దేశం బైట పెట్టాడు హనుమంతు.

రేఖ శాంతంగానే మళ్ళీ నవ్వింది. "అవన్నీ నాకు తెలీవు గానీ మావయ్యా, 'భారత సంస్కృతి' అంటున్నావు. మరి భారత ప్రభుత్వమే కదా ఈ సెలవు సంగతి తెచ్చిందీ! ఇరాన్ ప్రభుత్వమో, అరబ్బు ప్రభుత్వమో కాదు గదా?" అంది.

అరుణా, కమలా చప్పట్లు కొట్టి "రేఖా, రేఖా! ఎంత బాగా చెప్పావో!" అని ఆడబిడ్డని తెగ మెచ్చుకున్నారు.

హనుమంతు బాగా వుక్రోషపడ్డాడు. "ఆఁ.... ప్రభుత్వం ఇవ్వా ళో మాట అంటుంది, రే పో మాట అంటుంది. దాని కో వరసా వాయీ ఉంటేనా? సరే? కానివ్వండి! ఇదెన్నాళ్ళో అదీ చూద్దాం! మొగాళ్ళ మొహాన్న ఏం రాసి పెట్టి వుంటే అదే జరుగుతుంది" అని వాదం కట్టి పెట్టాడు.

వాసు తెల్ల మొహం వేసి - "అదేవిటి మావయ్యా, భలేగా వాదిస్తున్నావని మేం సంతోష పడిపోతోంటే, హఠాత్తుగా వెనకడుగు వేసేశా వేమిటి?" అన్నాడు.

"ఏం చేస్తాంరా? గవర్నమెంటు వాళ్ళ పక్షాన ఉంది. అదీ వాళ్ళ ధైర్యం!"

"ఉప్మా! ఉప్మా! ఉప్మా అండీ!" అని వేణూ హఠాత్తుగా వుప్మా ప్లేట్లతో ప్రవేశించాడు. "కరివేపాకూ అల్లం వేసిన వుప్మా! తీసుకోండి అందరూ!" అంటూ అందరికీ చకచకా అందించాడు, హనుమంతుకి తప్ప! "మావయ్యా! నీకు వంట చెయ్యడం చక్కగా వొచ్చి కూడా అత్తయ్య కోసం వొక్క పూటన్నా ఏమీ చేసి పెట్ట కుండా ఇలా తప్పించుకొచ్చావు. అందుకని, నేను చేసింది నీకు పెట్టను" అని నిర్మొహమాటంగా చెప్పాడు.

"ఏవిటోయ్, ఆడవాళ్ళని మహా వెనకేసు కొస్తున్నావు. రేప్పొద్దున్న పెళ్ళయ్యాక వొక్కపూటేం ఖర్మ, అన్ని పూటలూ నువ్వే వొండి పెట్టు-పెళ్ళాన్ని కూచోబెట్టి" అని వెటకారంగా నవ్వి సంతోషపడ్డాడు హనుమంతు.

వేణు తన పని తను చేస్తేనే-"ఒకరు ఇంకొకరికి చేసి పెట్టడం కాదు. ఇద్దరూ ఇద్దరికీ చేసుకోవాలి. ఒక్కరోజు కాదు, అన్ని రోజులూ ఒక్కలాగే చేసు

కోవాలి. మా వదినలిద్దరికీ అర్థం కానిది అదే" అన్నాడు.

వదినలిద్దరూ వెటకారంగా నవ్వారు-'ఆహా!... ఒక్కరోజు చెయ్యమంటేనే మన్నూ మిన్నూ ఏకం చేస్తున్నారు. ఇక రోజూ చెయ్యమంటే... అయినట్టేలే' అని మరిది మాటలు ఎగరగొట్టారు.

వేణు, వదిలిపెట్టలేదు-"అసలు మీ సమస్య మీకు అర్థమైతే అన్నీ సవ్యంగానే జరుగుతాయి. పెద్దన్నయ్య ఎప్పుడన్నా వంటింట్లోకి వొస్తే పెద్దొదిన ఏమనేది? 'మీ రెండుకూ ఇక్కడా వెళ్ళండి' అనేది. నే నెప్పుడన్నా పొయ్యి దగ్గర కూర్చుంటే మీ రిద్దరూ ఏమనేవారు? 'ఏమిటి వేణూ, ఎప్పుడూ ఆడంగి సింగడిలాగా వంటింట్లో తిరుగుతావూ' అనేవారు. అవునా, కాదా?" అని గతం గుర్తు తెచ్చుకోమన్నాడు వదినలిద్దర్నీ.

"అదంతా ఎప్పుడో! తెలీక అలా అన్నాం గానీ ఇప్పుడు అంటున్నామా?"

"ఇప్పుడు మాత్రం మీకు తెలిసింది ఎంత? మీ సమస్యే మీకు అర్థం కాలేదు."

వేణూ మీద హనుమంతుకి వొళ్ళు మండిపో తోంది. కనీసం తనకి కూడా వుప్మా పెడితే ఆ రౌద్రం కొంత తగ్గేదే. చేతనైనంత వెటకారంగా "వేణూ మహా ఆదర్శవంతుడై పోయాడండీ! ఎవత్తి వస్తుందోగానీ కాలు కింద పెట్టక్కర్లేదు. ఈయనే వంట చేస్తాడు. ఈయనే ఆ పిల్ల చీరలన్నీ వుతుకుతాడు..." అని నవ్వాడు.

వేణూ శాంతం తెచ్చి పెట్టుకున్నాడు "చీరలు వుతకడం అంటే అంత చిన్న చూపా మావయ్యా? మా అమ్మ చీరలు వుతకాలంటే నాకు కష్టంగా వుంటుందా? భార్య చీరలైనా అంతే. కలిసి బతికే ఆడవాళ్ళ బట్టలు వుతకడమే అంత తప్పు పని అయితే, మరి చాకళ్ళు, తరతరాలనించీ వూళ్ళో అందరి పెళ్ళాలకీ, అందరి పిల్లలకీ, పురిటి గుడ్డలతో సహా, పీతి గుడ్డలతో సహా, తెగుళ్ళ గుడ్డలూ, రోగాల గుడ్డలూ, మూటలు మూటలు మోసుకుపోయి వుతుకుతూనే వున్నారే! మరి అంత తప్పు పని వాళ్ళకెలా అప్పజెపుతున్నారు మీరందరూ?" అన్నాడు.

"ఇది మరీ బాగుంది! వాళ్ళ వృత్తి అదీ!"

"ఆఁ... వృత్తే! వాళ్ళ మీదకి గెంటేసిన వృత్తి! చూస్తూ వుండండి! ఆ వృత్తులే ఎదురు తిరుగు తాయి. అన్ని వృత్తులూ తారుమా రవుతాయి. ఆడపనులూ, మొగపనులూ అన్నీ ఏకం పాకం అవుతాయి."

రేఖ - "వేణన్నయ్యా! మావయ్యకి కూడా కొంచెం వుప్మా పెట్టు! ఎంత రుచిగా చేశావో చూస్తాడు" అంది.

వేణు తిరస్కరించాడు - "కావాలంటే రేపు చేసి పెడతాను. ఇవ్వాళ మాత్రం పెట్టను. ఇవ్వాళ పెట్టి, ఆడవాళ్ళ పోరాటాన్ని అవమానించను, అది ఎంత తెలివి మాలిన పోరాటం అయినా సరే! అమ్మో... స్టౌ మీద పాలు! నాన్నకి మళ్ళీ కాఫీ!" అంటూ వంటింట్లోకి పరిగెత్తాడు.

అప్పటికి ప్రసాదూ, వాసూ ఓ మూలకి చేరి, గుసగుస జరుపుతున్నారు.

"అన్నయ్యా! పోనీ మావయ్యని సాయం పెట్టుకుని ఆ వంటేదో చేసి పారేద్దామా? వుప్పెక్కు వేసేద్దాం. వాళ్ళ తిక్క కుదురుతుంది" అని తమ్ముడు గొప్ప మార్గం సూచించాడు.

"వుప్పెక్కు వేస్తే మన మెలా తింటాం?" అన్నాడు అన్న.

"మనకి వేరే గిన్నె పెట్టుకుందాం."

"అమ్మకీ, నాన్నకీ?"

"మనందరికీ వేరే గిన్నె! ఆ అక్కచెల్లెళ్ళిద్దరికీ వుప్పెక్కువ గిన్నె."

"మీ గిన్నిలో వుప్పెక్కు వేశాం. మీరు ఆ గిన్నెలోదే తినండి. మా గిన్ని ముట్టుకోకండి- అంటే, వాళ్లెందుకు తింటారు?" అని సందేహించాడు అన్న.

"ఏం, ఎందుకు తినరూ? మనం వంట చేసినప్పుడు మన ఇష్టం వొచ్చినట్టు వొండుతాం. ఎవరి కోసం ఎంత వుప్పు వెయ్యాలనిపిస్తే అలా వేస్తాం. మన ఇష్టమా, వాళ్ళ ఇష్టమా?" అని వాదించాడు తమ్ముడు.

"అదేం కుదరదులే. వా ళ్ళా గిన్ని తెచ్చి మన అన్నాల్లో దిమ్మరించి, మన గిన్ని లాక్కుంటారు. వా ళ్ళసలే మాంచి కోపం మీద వున్నారు."

"అబ్బా. ఎలాగ మరి? అన్నీ అడ్డాలే" అని ఏడుపు మొహం పెట్టాడు తమ్ముడు.


"మీ రిక్కడున్నారా?" అని ప్రవేశించింది శకుంతల- హనుమంతూ వాళ్లావిడ. ఫెళ ఫెళలాడుతోన్న ఆకుపచ్చ నేత చీరా, ముడి చుట్టూ పూలదండా, పెద్ద బొట్టూ... వుత్సాహంగానే ముస్తాబు చేసుకున్నట్టు కనపడుతోంది. "ఇదుగో, వస్తానని చెప్పారు. ఏ పేపరు తెచ్చుకుంటారో, వక్కపొడి తెచ్చుకుంటారో... ఇంకా వొస్తారు, ఇంకా వొస్తారు - అని ఎదురు చూస్తున్నాను. ఇక్కడ కూచున్నారా?" అంది, మింగేసేలా చూస్తూ.

శకుంతలకి వాళ్ళాయన ఇక్కడైనా దొరికాడు. కామేశ్వరికి అయితే, రాత్రి షిఫ్టుకి పోయిన వాడు తెల్లారి ఇంటికి రావాలా? "సోమవారం పొద్దున్న దాకా రా నని" కబురంపాడు.

"మరి నేను సెలవు ఎలా తీసుకోనూ?" అని కామేశ్వరి వూఁ... ఇదవుతోంటే శకుంతలే ధైర్యం చెప్పి, "ఇవ్వాళ నువ్వే వొండేసుకో. రేపు మీ ఆయన రాగానే సెలవు తీసుకో. అతని రోగం అలా కుదుర్చు" అని సలహా ఇచ్చి ఇలా వచ్చింది. రాగానే వాళ్ళాయన్ని సూటిగా అడిగేసింది - "వారానికి ఒక్కరోజు వంట చెయ్యడానికి అంత చిన్నతనంగా వుందా?... ఇంతకీ ఇంటికొచ్చి నాకు కాఫీ ఇస్తారా, లేదా?" తేల్చుమంది.

అందరూ నవ్వారు.

"అప్పుడే తొమ్మిది దాటింది. రోజూ ఈ పాటికి రెండుసార్లు తాగేదాన్ని. ఏ అట్టో పిట్టో



చేసుకుని కడుపునిండా తినేదాన్ని. ఏనాడన్నా మిమ్మల్ని తొమ్మిది గంటల దాకా కాఫీ ఇవ్వకుండా వుంచానా?" అంది కొరకొర చూస్తూ.

"ఇవ్వాళ వుంచావుగా?" అన్నాడు హనుమంతు పళ్ళు నూరుతూ.

అన్నపూర్ణమ్మ నోరు తెరిచేసి బుగ్గలు నొక్కుకుని - "శకుంతలా! నీ పిచ్చిగానీ... కాళ్లూ చేతులూ లేని దానిలాగా అతను చేసి ఇవ్వడమేమిటే? హాయిగా నువ్వే చేసుకుని తాగకూడదూ?" అంది బుగ్గలు అలాగే పట్టుకుని.

"ఆఁ... నేనెందుకు చేసుకోవాలి? ఆడవాళ్ళకి సెలవా, కాదా?" అని మళ్ళీ భర్త గార్ని కొరకొరా చూస్తూ - "ఏవిటీ మాట్లాడరేం? ఇంటికి వొస్తారా, రారా?" తేల్చెయ్యమంది తొందరగా.

"వొస్తాను. కానీ వొంట చెయ్యను."

"ఏం, ఎందుకు చెయ్యరూ?"

"ఇంట్లో వంట ఆడవాళ్ళే చెయ్యాలి."

"అలా అని ఎక్కడుందీ?"

"వేదాల్లో రాశారు."

"ఏదీ చూపించండి!"

"చూపిస్తా. ముందు వంట చెయ్యి. తినేసి, ఓ కునుకు తీసి లేచి చూపిస్తా."

"పోనీ రాశారే అనుకుందాం. మరి నిన్న పత్రికల్లో ఆడవాళ్ళ సెలవు గురించి రాశారుగా?"

"ఏమో, వేదాల్లో సెలవుల సంగతి లేదు. వేదాలు ముందు పుట్టాయా, పత్రికలు ముందు పుట్టాయా?"

"వేదాల కాలంలో పుట్టిన వాళ్ళకి వేదాలూ, పత్రికల కాలంలో పుట్టిన వాళ్ళకి పత్రికలూ! అంతేకదా?"

"అంతే కాదు. నేను వేదాల కాలంలోనూ, నువ్వు పత్రికల కాలంలోనూ వుంటే, మన సంసారం ఏ కాలంలో వుంటుంది?" అని కోపంగా చూశాడు హనుమంతు.

శకుంతల ఠకీమని - "పోయే కాలంలో వుంటుంది" అని జవాబు చెప్పేసింది.

"అబ్బబ్బబ్బ! నిన్నటి నుంచీ తల పెట్లి పోతుంది" అని హనుమతు తల పట్టుకున్నాడు.

**(సశేషం)**


మనసు గతి ఇంతే... మనిషి బతు కింతే...
పాట ఆపండి.

మనసు మాయ

చదివి
"మనసున మల్లెల
మాలలూగెనే"
అని హాయిగా
పాడుకోండి.

ప్రముఖ
హిప్నోథెరపిస్టు,
మెజీషియన్
ప్రొ॥ బి.వి.
పట్టాభిరామ్
ధారావాహిక

త్వరలో!

# రంగనాయకమ్మ

# అమ్మకి ఆదివారం లేదా?

(కిందటి సంచిక తరువాయి)

**అనుకోకుండా చుట్టాలు వొచ్చే శుభ శకునాలు కనపడ్డాయి. ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడైంది.**

**కొందరు అటు పరిగెత్తారు.**

**"చుట్టాలేమో అక్కయ్యా!" అంది కమల భయంగా.**

'చుట్టాలా? ఇప్పుడొచ్చి ఏం తింటారు?' అని అన్నపూర్ణమ్మ దీర్ఘం తీసింది.

[illegible]

వాసు ఎగిరి గంతేసి "చుట్టాలా? రానివ్వండి, రానివ్వండి. ఆడవాళ్లేనా? వంట చేస్తారు" అని మళ్లా గంతేశాడు.

కమల అభ్యంతరం తెలిపింది. "చుట్టాలతో చేయిస్తే మేం ఎందుకు వొప్పుకుంటాం?"

"ఇది మరీ బాగుంది. మేం చేస్తే మీ కెందుకు, చేయిస్తే మీకెందుకు?" అని ఎదురు తిరిగాడు వాసు. కానీ అతని ఆశలన్నీ నిరాశలు చేస్తూ ఆటో వెళ్లిపోయింది.

రేఖ లోపలికొస్తూ - "మనింటికి కాదు. వేప చెట్టు ఇంటివాళ్లు ఎక్కడికో వెళ్తున్నారు" అంది.

"ఇంకెక్కడికి? మనలాగే కుమ్ములాడుకుని ఏ హోటల్‌కో బైల్దేరివుంటారు... అరే వేణూ! మనందరం హోటల్‌కి పోతే ఎంతవుతుందో లెక్క కట్టూ!" అని అరిచాడు వాసు.

వేణు చకచకా లెక్కలు చెప్పేశాడు - 'వెళ్లడానికి 3 ఆటోలు. లేకపోతే ఒక వ్యాను. హోటల్లో కనీసం నూట యాభై. తిరిగి రావడానికి 3 ఆటోలు. లేదా వ్యాను. మళ్లీ రాత్రికీ అలాగే. ఇంటికి రాకుండా అక్కడే వుండిపోతే ఆటోల ఖర్చులు కలిసి వస్తాయి.'

వాసు మళ్ళీ నోరెత్తలేదు.

పనీసాటా లేకుండా నించున్న పెద్ద వాళ్ళిద్దరికీ సిగ్గు వొచ్చేలాగ చేద్దామని అరుణ కోపంగా- "వేణు చూడండి, ఎంత చక్కగా ఇంత మందికి కాఫీలు పెట్టాడు. వుప్మా చేశాడు. ఇలాంటి పని మీరెందుకు చెయ్యలేరూ?" అంది.

"వాడు చేసేశాక మళ్ళీ మేం చెయ్యడం ఎందుకూ?" అని తలెగరేశాడు ప్రసాద్.

[illegible] చమత్కారాలు కట్టి పెట్టి వంట మొదలు పెడతారా, లేదా?" తేల్చమంది అరుణ.

"అయితే రాత్రికి కూడా వంట చెయ్యరా మీరు?" అని ఆశ్చర్యపడ్డాడు ప్రసాద్ - "పోనీ సెలవు అంటే ఒక్కపూట చాలదూ?... ఒక పని చేద్దాం, ఇప్పుడేగా వుప్మాలు తిన్నాం. ఇక ఈ పూటకి అన్నాలు మానేద్దాం. మీరు చక్కగా ఈ పూట సెలవు తీసుకోండి. సాయంత్రం తొందరగా లేచి చక్కగా వంట చేసెయ్యండి ఏం?" అన్నాడు.

అరుణ పళ్ళు కొరుకుతూ - 'మా సెలవు అంటే అంత ఆటలాగా వుందా? మీరిద్దరూ తక్షణం వంట మొదలు పెడతారా లేదా చెప్పండి' అని అరిచింది.

ప్రసాద్ - "వాడి సంగతి నాకు తెలీదుగానీ నేను మాత్రం చెయ్యనూ, చెయ్యనూ, చెయ్యనూ. మళ్ళీ చెప్పనా, చాలా?" అని తేల్చేశాడు.

"ఎందుకు చెయ్యరూ?" - అరుణ.

"ఎందుకు చెయ్యాలీ?" - ప్రసాద్.

"ఇవ్వాళ నాకు సెలవు గనకా."

'ఇవ్వాళ నాకూ సెలవే! వారానికి 6 రోజులు పని చేస్తానా? ఒక్కరోజే నాకు సెలవు. ఆసెలవు రోజున నన్ను పని చెయ్యమంటే, నేను 7 రోజులూ పని చేసినట్టు అయిపోవడం లేదూ? మరి నా సెలవు మాటేమిటి? నువ్వు బైట వుద్యోగం చేసే మనిషివి అయితే, నన్ను కూడా ఇంట్లో పని చెయ్యమనడానికి నీకు హక్కు వుంటుంది గానీ...'

వాసు కంగారు పడిపోతూ - "అన్నయ్యా! నువ్వు నా పీకల మీదకి తెచ్చేలాగ వున్నావు" అని అడ్డం పడబోయాడు.

"నువ్వాగరా! నా సంగతి నేను చెప్పుకోవాలా, వద్దా?" అని అన్న - తమ్ముణ్ణి కసిరాడు. "విను అరుణా! నేను బైటికి పోయి 8, 10 గంటలు పని చేస్తున్నాను. నువ్వయినా అన్ని గంటలూ చెయ్య వలసిందే. అలాగే చేస్తున్నావు. అంతేకదా?"

"సరే, అలాగే అనుకుందాం. మరి మీకు ఒక రోజంతా సెలవు వుంది. ఆ రోజంతా మీకు ఏ [illegible] పని వుండదు. మరి నాకు ఆ రోజు కూడా ప్రతి రోజు లాగే పని వుంటుంది కదా? నేను ఎక్కువ గంటలు చేస్తున్నట్టు అర్థం కాదూ?"

ఏదో చిక్కులో పడ్డానని గ్రహించాడు ప్రసాద్. ఒక్కక్షణం చకచకా ఆలోచించాడు. "ఆఁ.... ఇందాక కొంచెం లెక్క తప్పు చెప్పాను. రోజూ నా డ్యూటీ కాలం 8 గంటలు కదా? నీ పని 8 గంటలు వుండదు. 6 గంటలే వుంటుంది. నీకు రోజూ 2, 3 గంటలు పగలు విశ్రాంతి వుంటుంది. అంటే, నీకు రోజూ కొంచెం సెలవు వుంటుంది. అన్ని రోజుల సెలవులూ కలిపితే నీకూ ఒక రోజు సెలవు దొరికినట్టే. ఇపుడు సరి పోయిందా లెక్క?"

అరుణకి ఏడుపొచ్చినంత పనైంది. "నాకు రోజుకి 6 గంటలేనా పని?"

"అంతకన్నా ఎక్కువ గంటలు పని చేస్తున్నావా? ఎవరితోనన్నా చెప్పించు."

"సరే, నా సంగతి అలా వుంచుదాం. ఇంకా బోలెడు పని చేసుకునే ఆడవాళ్ళ మాటేమిటి?"

"వాళ్ల మాటలు నా కెందుకూ? నీ మాట తేల్చు."

"ఆడవాళ్ళందరికీ సెలవు వుండాలన్నారుగా? అంటే నాకూ సెలవేగా? ఆ సెలవు, నే నెలా తీసుకోవాలి?"

"ఏమో, ఎలా తీసుకోవాలో! తీసుకోమన్న వాళ్ళని అడుగు! నా సెలవుని ఇచ్చెయ్యమంటే, నే నెందుకిస్తానూ? నా సెలవు రోజున పని చెయ్య మంటే నే నెందుకు చేస్తానూ?"

"సరే, అడుగుతాను, ఇప్పుడే అడుగుతాను"




అని అరుణ గబగబా ఫోను తిప్పేసింది. "హలో! హలో! గవర్నమెంటు కావాలండీ! చాలా అర్జంటు! అర్జంటుగా కావాలి!"

అవతల నుంచీ చక్కగా ఒక మొగ కంఠం పలికింది - "హలో! ఎవరమ్మా?" - అబ్బా!

ఎంత గాంభీర్యం పుట్టిపడుతూందో ఆ కంఠం!

"గవర్నమెంటేనాండీ మీరూ?"

"అవునమ్మా, ఏం కావాలి మీకు?" గవర్నమెంటు కంఠం అందరికీ జేగంటలాగా వినపడుతూనే వుంది.

"ఏవండీ, ఇళ్ళల్లో వుండే ఆడవాళ్ళకి వారానికో రోజు సెలవు వుండాలని మీరు పేపర్లలో రాశారు కదండీ?"


"అవునమ్మా రాశాం. చక్కగా ఒక రోజు విశ్రాంతిగా గడపండమ్మా!"

"ఎలా గడుపుతానండీ? పని చెయ్యనని మా ఆయన పొద్దున్నుంచీ ఒకటే పోట్లాట! మరి నన్నేం చెయ్యమంటారండీ?"

అవతల కంఠం గాభరా పడింది. "ఆఁ... పని చెయ్యనంటున్నాడా? అలా అనడానికి వీల్లేదే! సెలవు సంగతి ఆయనకి చెప్పావామ్మాయ్?"

"సెలవు పప్పులు నా దగ్గర వుడకవ్ - అంటున్నారండీ!"

"ఆఁ.... ఆఁ... అంత మాటన్నాడా? అంత మాట! ఏదీ, అతన్ని పిలువ్!"




ఫోనుని ప్రసాద్ లాక్కున్నాడు. "అంత మాటన్నవాడిని నేనే సార్!"

"అన్నావా అంత మాట?"

"అంత మాటే కాదు, ఇంకెంత మాటైనా అంటానండీ!"

'ఆఁ... ఆఁ... నీకేం లెఖ్ఖలేదా మా మాటంటే?'

"ముందు మీకు లెఖ్ఖలు వొస్తే కదండీ?"

"ఆఁ... మాకు లెక్కలు రావా?"

"సూటిగా చెప్పేస్తాను లెండి సార్! మా ఆవిడ వుద్యోగం చేసే మనిషి కాదండీ! ఇంటి పనే చేస్తుందండీ. బైట పనే లేదండీ. రోజూ రొండు పూటలా లక్ష్మి వొచ్చి అంట్లు తోమి, గదులూ వాకిళ్ళూ వూడ్చి, కొన్ని బట్టలు వుతికి, అప్పుడప్పుడూ పప్పులు రుబ్బి... ఆ పనులన్నీ చేస్తుందండీ. అరుణ ముఖ్యంగా వంటే చేస్తుందండీ..."

వెనకనుంచీ వాసు - "మా ఇంట్లో కుక్కరు కూడా వుందని చెప్పూ" అని గుసగుసలాడాడు.

"నువ్వడ్డం రాకు" అని, అన్న తమ్ముణ్ణి కసిరి "అయ్యో, అదండీ. రోజు 8 గంటలు పని ఎవరైనా చేయవలసిందే కదండీ? అరుణ కూడా అలాగే చేస్తోందండీ."

"అయ్యో, చెయ్యొద్దూ మరీ?"

"అదేనండీ నే నేది. ఆవిడకి ఏ రోజు విశ్రాంతి ఆ రోజే వుంటుందండి. ఇంకో సంగతి చెప్ప మంటారా? రోజూ బట్టల మీద అద్దాలూ పూసలూ గవ్వలూ కుట్టుకోడానికే రోజూ 2 గంటలన్నా ఖర్చు పెడుతుందండీ! ఏదన్నా పరీక్షలకి చదువుకోమంటే వినదు. ఏదన్నా పని నేర్చుకోమంటే వినదు. అలాంటప్పుడు నేనేం సాయం చెయ్యగలను చెప్పండి? నా సెలవు రోజుని ఆవిడకి ఇచ్చెయ్య మంటే, మరి నాకు సెలవెప్పుడు మీరే చెప్పండి!'

'అచ్చచ్చా! మంచి పాయింటే. పోనీ అబ్బాయ్... ఇద్దరూ చెరో పూటా సెలవు తీసుకోండి. ఏం, ఇద్దరికీ సెలవు వుంటుంది. బాగా చెప్పానా?'

"అదేవన్న మాట సార్? నా పూర్తి సెలవు నాకే వుండాలి! అది నా హక్కు! నా సెలవులో ఒక పూటని నే నెందుకివ్వాలి?"

"ఓహో! అలాగంటావా?"

"అవున్సార్! అలాగే అంటాను."

"అచ్చచ్చా! నీ పాయింటు నోట్ చేసుకుంటాంలే."

"మరి నేను నా సెలవు నాడు విశ్రాంతి తీసుకోవచ్చు కదండీ?"

"అయ్యో, తీసుకోవద్దూ మరీ?"

'బతికాన్రా దేవుడోయ్! నేను పనిచెయ్యక్కర లేదోచ్!' అని ప్రసాద్ చేతులు పైకెత్తేసి దణ్ణాలు పెడుతోంటే, అరుణ కోపంతో వూగిపోతూ ఫోను మళ్ళీ లాక్కుంది. "అయ్యా, గవర్నమెంటు గారండీ! మా ఆయన అన్నీ తప్పు లెక్కలు చెపుతున్నాడండీ! ఆయనకి డ్యూటీ నించి ఇంటి కొచ్చేస్తే మిగతా కాలం అంతా ఖాళీయే నండీ! మరి నేను ఏ బాదర బందీ లేకుండా అంత ఖాళీగా వుంటానండీ....? పిల్లాడితో నాకు ఎప్పుడూ పని లాగే వుంటుందండీ. పిల్లలకి రెండేళ్లు దాటే దాకా తల్లికి నిద్రే వుండదండీ! మరి అదంతా ఆయన లెక్క కట్టడం లేదండీ!"

"అచ్చచ్చా! మంచి పాయింటేనమ్మా!"

అంతలో కమల "అక్కయ్యా! నేనూ మాట్లాడతా" అని లాక్కుంది ఫోను.

"హలో! హలో! నా పేరు కమలండీ!"

అవతల కంఠం - 'చెప్పమ్మా! నీ సమస్యేవిటీ?

"మా అక్కయ్య అయితే, బైట వుద్యోగం చెయ్యడంలేదు. సరే. మరి నేను వుద్యోగం చేస్తున్నాను కదండీ. నా జీతం కూడా ఇంట్లోకే ఖర్చు పెడుతున్నానండీ! అత్తమామల్ని తల్లిదండ్రుల్లాగే చూసుకుంటున్నానండీ. మరి ఇంటి పనుల్లో ఒక భాగం మా ఆయన కూడా చెయ్యాలి కదండీ? వూహూ! ఈయన కూడా చెయ్యనని మొరాయించి కూర్చున్నాడండీ! నాకేమో ఇంటా బయటా కలసి రొండు పనులా? ఆయనకేమో ఒక్క పనేనా? ఇదేం న్యాయం, మీరే చెప్పండి?"

'అబ్బే! అదేం న్యాయం? న్యాయమే కాదు.'

కమల సంబరపడిపోయింది. "న్యాయం కాదు గదండీ, కాదు గదండీ. మరి మా ఆయన్ని మీరు చివాట్లేస్తారాండీ?"

"పిలువ్... వేస్తాను. పిలువ్ తొందరగా."

"ఇదుగో మిమ్మల్నే. గవర్నమెంటు గారు పిలుస్తున్నారు. రమ్మంటున్నారు" అని కమల కేకలు పెట్టింది.

"నన్నా? ఎందుకూ? నాతో ఏం పనీ ఆయనకి?" అని బెదురుకుంటూ వచ్చాడు వాసు. - "సార్... సార్... పిలిచారట సార్?"

"అవునయ్యా. పిలిచాను. మీ ఆవిడకి రొండు పనులు, నీకు వొక్క పనా? లెఖ్ఖేవన్నా బాగుందా?"

"ఆయ్... బాగులేదా సార్?"

"ఏం బాగుందయ్యా? నువ్వే చెప్పు?"

'పోనీ కమలని కూడా వొక్కపనే తీసుకో మనండి సార్! ఇంట్లో వుండిపొమ్మనండి సార్!'

"మరి జీతం ఎలా వొస్తుంది? మీ ఇల్లు ఎలా గడుస్తుంది?"

"అదే సార్.... కష్టమే సార్!... కానీ ఏం చెయ్యను సార్? మా అమ్మ నాకు ఏ పనులూ నేర్పలేదు సార్!"

"ఏదీ మీ అమ్మను పిలువ్!"

"అయ్యయ్యో, వొద్దు సార్! మా అమ్మకి జొరం! లేవడం లేదండీ. నాకే చెప్పెయ్యండి సార్!"

"మీ ఇంట్లో కుక్కరు కూడా వుంది కదా? మరి ఏం కష్టం నీకు వంట చెయ్యడానికి?"

"అబ్బబ్బే, ఆ కుక్కరు అసలు పనే చెయ్యదు సార్!"

గవర్నమెంటుగారు గొంతు తగ్గించి గుసగుస

లాడారు - "ఇక్కడ పుల్ల తీసి అక్కడా, అక్కడ పుల్ల తీసి ఇక్కడా పెట్టండయ్యా! లేకపోతే మా బిల్లేం కావాలి?"

"ఆయ్... పుల్లలు ఇటూ అటూ పెట్టేస్తేనే వంట అయిపోతుందా సార్?"

"అబ్బా, ఈ కుఱ్ఱాళ్ళకి తెలివే వుండడం లేదు.... చూడూ, నీ పేరేంటన్నావ్?"

"వెంకట శ్రీలక్ష్మీ వాసుదేవ నాగేసఱ్ఱావండీ. ఇంటి పేరు కూడా చెప్పమంటారా సార్?"

"వొద్దొద్దు. అంత పేరు పిలవలేను గానీ, నీ ఆరోగ్యం మరీ అంత మంచిదా? ఎప్పుడూ ఏ నెప్పులూ రానే రావా? తలనెప్పో, మెడనెప్పో, పంటినెప్పో... తుంటి నెప్పో...."

"తెలిసింది సార్! అర్థమైంది సార్! థాంక్యూ సార్! నా ఓటు మీకే సార్!" అనేసి వాసు ఫోన్ ఠకీమని పడేశాడు. 'ఇప్పుడే వొస్తా, ఇప్పుడే వస్తా' అంటూ బైటికి పరుగు లంకించుకున్నాడు.

'అదేమిటి? అదేమిటి? ఎక్కడికి పోతున్నాడు?' అని అందరూ హాహాకారాలు చేస్తోండగానే ఏదో కాయితం ఎగరేసుకుంటూ వొచ్చి కమల ముందు వాలాడు - "ఇదుగో చూసుకో! డాక్టర్ స...ర్టి...ఫి..కె...ట్...! నాకు తల నొప్పి! మెడ నొప్పి! కడుపు నొప్పి! మోకాళ్ళ నొప్పి! శీలమండల నొప్పి! వొళ్ళంతా వొకటే నొప్పులే నొప్పులు! మనసు కూడా ఏం బాగోలేదు. డాక్టరు ఈ రోజంతా రెస్టు తీసుకోవాలన్నాడు" అంటూ ఆ కాయితం కమల మొహం మీద ఆడించాడు.

'రెస్టు తినా, తినకుండానా? ఎంత మోసం!' అని కమల కోపంతో వూగిపోయింది. "సరే, నేనూ చూస్తాను" అని టకటకా ఫోను తిప్పింది. "హలో...హలో...హలో... గవర్నమెంటుగారేనా? చూశారా? మా ఆయన్ని పని చెయ్యమని మీరు చివాట్లేసినా ఆయన వంటింట్లోకి రాకుండా డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చేసుకున్నాడండీ! నేను కోర్టుకి పోదలచుకున్నాను. మీరు వెంటనే ఆ డాక్టర్ సర్టిఫికెట్ చెల్లకుండా 'స్టే' పంపాలి సార్! లేకపోతే ఈయన పని చెయ్యడు. ఆయన అన్నగారెలాగూ పని చేయ్యడం లేదు. ఈయన్ని కూడా నేను వదలదల్చుకోలేదు. ఎందుకు వదలాలి సార్?... అర్జంటుగా 'స్టే' పంపాలి సార్ నాకు!

"సరేనమ్మా! ఇప్పుడే పంపిస్తా!"

"ఇంకొక్క మాట సార్! అసలు ఆడవాళ్ళ సెలవు రోజున ప్రతీ ఇంటికీ ఇద్దరేసి పోలీసుల్ని పంపాలండీ. లేకపోతే ఈ మొగాళ్ళు పని చెయ్యరండీ."

వెనక నుంచి శకుంతల - "మొగ పోలీసులు వొద్దు. ఆడపోలీసుల్నే పంపమని చెప్పు" అని గుడగుడ లాడింది.

'సార్, సార్... మొగపోలీసులైతే వీళ్ళూ వాళ్ళూ కుమ్మక్కైపోతారండీ. ఆడపోలీసులే కావాలండీ.'

"ఆడ పోలీసు స్టాఫ్‌ని పెంచితే గానీ అది అప్పుడే సాధ్యం కాదమ్మా! నీ కెందుకు? 'స్టే' పంపిస్తాను కదా?"

"సరే సార్!"

ఫోను పెట్టేటప్పటికి 'స్టే' రానే వచ్చింది.

"కమలాదేవి గారెవరండీ? 'స్టే' తెచ్చాను" అని కోర్టు మనిషి ప్రత్యక్షమయ్యాడు గుమ్మంలో.

కమల ఆ స్టేతో వాసు దగ్గరకి వురికింది. 'ఇదుగో స్టే! చదువుతున్నాను. అందరూ వినండి' అని గబగబా చదివింది - "స్త్రీల సెలవు రోజున మొగవాళ్ళకి ఎక్కడ ఎన్ని నొప్పులున్నా సరే, , మనసులూ, ఆత్మలూ, ఎంత ఏడుస్తూ వున్నా సరే, నోరు మూసుకుని కిక్కురు మనకుండా ఇంటి పని లోకి దిగవలసిందే! మొగాళ్ల తెచ్చుకునే డాక్టర్ సర్టిఫికెట్లు ఇంట్లో చెల్లనేరవు. ఇది గవర్నమెంటు వారి ఆజ్ఞ!"

అరుణా, శకుంతలా పొంగిపోయారు. "ఎంత బాగా రాశారో! ఎంత బాగా రాశారో!" అని ఆశ్చర్యపోయారు.

కమల ధీమాగా 'స్టే' కాయితాన్ని వాసు మొహం మీద ఆడించింది. "ఇప్పుడే చెపుతావు" అన్నట్టు.

వాసు, లోపల్లోపల భీతెత్తాడు మొదట. కానీ మరు నిమిషంలో తేరుకుని కమలకన్నా ధీమాగా నవ్వాడు. "దాచుకో దాన్ని! రేప్పొద్దున్న నాలిక గీసుకుందువుగాని" అన్నాడు.

"హేవిటీ! స్టే వొచ్చినా..." అని కమల 'నిర్ఘాంతం'తో మాటే పూర్తి చెయ్యలేకపోయింది.

వాసు ఒక కుర్చీ చూసుకుని, కాలు మీద కాలేసుకుని కూర్చున్నాడు.

"ఎన్ని సార్లు చెప్పాలి? ఏ పనీ చెయ్యనూ, చెయ్యనూ, చెయ్యనూ!" అని కాళ్ళు ఇటూ అటూ మార్చుకున్నాడు.


"మరి నా స్టే?" అని అరిచింది కమల.

"వెకేట్ ఐపోయింది. అనగా తోసి పారేశాను. నేను కదలకుండా కూచుంటే సరీ. ఇది నా చేతిలో పని" అని సరిగా అర్థం చెప్పాడు వాసు.

ఆడవాళ్ళంతా నోళ్ళు తెరిచేశారు.

అన్నపూర్ణమ్మకి కూడా "అయ్యో, ఇలా అయిందే!" అని మనసులో ఎక్కడో చివుక్కు మనిపించింది.

**(ముగింపు వచ్చేవారం)**




# రంగనాయకమ్మ

# 'అమ్మకి ఆదివారం లేదా?

(కిందటి సంచిక తరువాయి)

**'అహ్హహ్హహ్హా" అంటూ వేణూ పెద్ద నవ్వుతో రంగంలోకి ప్రవేశించాడు. "వదినలూ! తెలిసిందా ఇప్పటికైనా? 'మేం చెయ్యం' అన్న మొగవాళ్లని గవర్నమెంటు ఏమీ చెయ్యలేదని తెలిసిందా?"**

**కమల మండిపడుతూ నిప్పులు కురిసింది. "మళ్లీ కంప్లయింట్ ఇస్తే వెయ్యి రూపాయలు జరిమానా వేస్తారు, తెలుసా?" అంది.**




"సరే, వేస్తారు. మొగాళ్లు పని ఎగ్గొట్టేసి జరిమానాలు కట్టేస్తే గవర్నమెంటుకి డబ్బొస్తుంది. దాని వల్ల మీకే వొస్తుంది? సెలవు వొస్తుందా? మీకు సెలవైతే రాదు కదా? ఆ రోజు కూడా ఇంటి పనులన్నీ మీరు చేసుకోవలసిందే కదా?"

ఆడవాళ్లు తెల్లగా తెల్లబోయారు.

శకుంతల వొక్కత్తీ కాస్త తొందరగా తేరుకుని- "ఆ డబ్బు మాకే ఇచ్చెయాలని అడిగితే?" అని మిగతా వాళ్లని నవ్వు మొహంతో చూసింది.

"సరే, ఆ డబ్బు మీకే ఇస్తారనుకుందాం. అప్పుడు మాత్రం ఏం జరుగుతుంది? మీకు సెలవు వొస్తుందా? మీరు ఏ సెలవు కోసమైతే అడుగుతున్నారో ఆ సెలవు అయితే అప్పుడు కూడా రాదు కదా? డబ్బు తీసుకున్నాక, ఆ రోజు కూడా పనులన్నీ మీరే చేసుకోవాలి. అంటే, మీ సెలవుని డబ్బు కోసం అమ్మేసుకున్నారన్నమాట! డబ్బు తీసుకుని పని చేస్తారన్న మాట!"

అంతా నిశ్శబ్దం! పిట్టలూ, దగ్గులూ అన్నీ ఆగాయి.




కమల గంభీరంగా అంది - "అవును వేణూ! నువ్వన్నదే నిజం! వాళ్లకి జరిమానాలు వేస్తే మా కేమిటి, జైళ్లల్లో పెడితే మా కేమిటి? వాటి వల్ల మాకు సెలవైతే రాదు కదా? వాళ్ళు ఇష్టపడి ఇస్తేనే మేము సెలవు తీసుకోవాలన్న మాట! అంటే, మా హక్కు వాళ్ళ దయ మీద ఆధారపడి వుందన్న మాట! హూ! అదేం హక్కు? మరి వేణూ? ఎలాగ ఈ సమస్యకి పరిష్కారం?"

"ఎలాగేమిటి?... తి...ర...గ...బా...టే..."

"ఇదంతా తిరగబాటు కదా?"

"కాదు. ఇదంతా వుత్త నవ్వులాట! వుత్త కాలక్షేపం ఆట!"

"మరి 'తిరగబాటు' ఇంకెలాగ?"



"ఆలోచిస్తే మీకు తెలీదూ? పెద్దొదినా! నువ్వు చెప్పు. 'ఆడామగా సమానులే' అని నువ్వు నిజంగానే అనుకుంటావా?"

"ఎందుకు అనుకోనూ? అందరూ ఒకటే. అందరూ మనుషులే."

"మరి ఇంటి పనికే అంకితమై వుంటానని ఎందుకు వొప్పుకుంటున్నావు?"

"అలా నే నెప్పుడొప్పుకున్నాను?"


"ఇంటిపని నించీ వారానికి ఒక్కరోజు సెలవు అడగడం అంటే, 'మిగతా 6 రోజులూ నేను చేస్తాను, అది నా బాధ్యతే' అని ఒప్పుకోడం కాదా?"

"వుద్యోగం చేస్తోన్న కమల కూడా అలాగే అడుగుతోందిగా మరీ?"

"కమల వదిన మరీ తప్పు చేస్తోంది. చిన్నన్నయ్యని ఇంటి పనులు రోజా చెయ్యాలని డిమాండ్ చెయ్యడానికి కమల వదినకి పూర్తిగా హక్కు వుంది. అలాంటి హక్కు నీకు అంత పూర్తిగా వుండదు. తనకి ఏ హక్కు వుందో చిన్న వదినకీ తెలీదు; నీకు ఏ హక్కు లేదో నీకూ తెలీదు. బైట పని చేసే ఆడవాళ్ళ పరిస్తితీ, చెయ్యని ఆడవాళ్ళ పరిస్తితీ పూర్తిగా ఒకే రకం కాదు. అయినా ఒక రోజు సెలవు పోరాటం వుద్యోగాలు చేసే స్త్రీల పరిస్తితికీ పనికి కాదు. చెయ్యని స్త్రీల పరిస్తితికీ పనికి రాదు. అసలు ఒక రోజు సెలవు ఆలోచనే తప్పు.

మొగాళ్లకి బైట పనీ, ఆడవాళ్లకి ఇంటిపనీ - అనేది ఏనాటి నించో సాగుతోంది. నువ్వూ శకుంతల అత్తయ్యా ఈ సాంప్రదాయానికే లోబడి నడుచుకుంటున్నారు. ఎప్పుడూ అలాగ వుండి పోడానికే వొప్పుకుని 'ఒక రోజు సెలవు' అడుగు తున్నారు. సెలవు దొరికితే అంతా చక్కబడిపోయి నట్టే అనుకుంటున్నారు. కానీ, దాని వల్ల మీ సమస్య లేవీ తీరవు.

ఆడామగా సమానం అవ్వాలంటే సరైన ఏకైక




సూత్రం ఏమిటో తెలుసా?

ఇద్దరికీ - బైటపనీ,

ఇద్దరికీ - ఇంటిపనీ! అదీ సూత్రం!

బైట పనికే సెలవులు వుంటాయి. అవి ఇద్దరికీ వుంటాయి.

ఇంటి పనికి సెలవులు వుండవు. అవి ఇద్దరికీ వుండవు.

బైటపనికే ఇన్ని గంటలు అనే హద్దులూ పరిమితులూ సాధ్యం!

ఇంటి పనికి అలాంటి హద్దులూ లెఖ్ఖలూ కొలతలూ సాధ్యం కావు.

ఇంటిపని అంటే, వంటలూ, తోముళ్లూ, వుతుకుళ్లూ మత్రమే కాదు. అందులో, పిల్లల పెంపకాలూ, వృద్ధుల సంరక్షణలూ ఏకమైపోయి, పెనవేసుకుపోయి వుంటాయి. వాటిని గంటల లెఖ్ఖలోకి ఇమడ్చడం సాధ్యంకాదు. ఇంట్లో వున్న రోగిష్టి మనుషుల కోసం చెయ్యవలసిన పనుల్ని అది నీ వొంతే అంటే నీ వొంతే అని కీచులాడుకునే మనుషులు, జంతువులతో పోల్చడానికి కూడా తగని వాళ్ళు! చంటి పిల్ల అవసరాల్ని ఒకరి మీదకి ఒకరు గెంటుకునే తల్లి దండ్రుల్ని దేనితో పోల్చాలో ఇంకా కనిపెట్టాలి!

ఇంటిపని-గాలి పీల్చడం లాంటిది. దానికి రాత్రీ పగలూ, నిద్రా మెలకువా అనే హద్దులు వుండవు. దానికి విరామాలూ విశ్రాంతులూ సెలవలూ వర్తించవు.

బైటపనీ, ఇంటిపనీ - రెండూ కలిసినదే మనుషుల జీవితం! మనుషులుగా వుండ దల్చుకున్న వాళ్లు, ఆ రెండు పనుల్ని తమ బాధ్యతగా గ్రహించుకోవాలి. ఆ బాధ్యత, ఈ రోజూ ఆ రోజూ అని కాదు! ఈ వారం ఆ వారం అని కాదు. అన్ని రోజులూ ఒక్కలాగే! అన్ని వారాలూ ఒక్కలాగే!

బైటపని లక్షణాల్ని ఇంటిపని లక్షణాల్నీ అస్తవ్యస్తం చేసేసి, అందులో నించి ఏదో పట్టుకుందామంటే ఏం దొరుకుతుంది, కుమ్ములాటలూ యుద్ధ భీభత్సాలూ గాక?

మనింట్లో తెల్లారుఝాము నించీ జరుగుతోంది అదే!

పెద్దొదినా! చిన్నొదినా! శకుంతల అత్తయ్యా! నా మాటలకి విలువిచ్చి రెండు నిముషాలు విన్నారు. ఇంత శ్రద్ధగా విన్నారంటేనే మీ సమస్య మీద మీరెంత బాధపడుతున్నారో అర్థమవుతుంది. కానీ బాధపడితే చాలదు. మార్గాన్ని సరిగా గ్రహించుకోక పోతే సాధించేదేమీ వుండదు. ఇక, మీ పోరాటం ఎలా చేసుకుంటారో చేసుకోండి! చెయ్యక పోతే ఎప్పటి లాగే వూరుకోండి! వాళ్లకి దయ కలిగిన నాడు, లేకపోతే మావయ్య అన్నట్టు, మీకు రోగాలో రొష్టులో వొచ్చిన్నాడు, మొగాళ్లు ఏదన్నా పని చేస్తే దానితో సంతోషించండి. లేకపోతే లేదు. అంతేగానీ, అసలు సమస్యని అర్థం చేసుకోకుండా తప్పు పోరాటాలకి దిగి నవ్వుల పాలైపోకండి!"

వేణూ వుపన్యాసం ప్రేక్షకులందరిలోనూ రకరకాల మార్పులు తెచ్చింది.

అందరి కన్నా ముందు కమల సరిగానే అర్థం చేసుకుంది. "మాకు ఎవరి దయా అక్కరలేదు. మాకు కావలసింది సహాయంగా కాదు. హక్కుగా కావాలి!" అని గట్టిగా ప్రకటించింది.

"అక్కయ్యా ఇలారా!" అని అక్కగార్ని తలుపు చాటుకి తీసుకుపోయింది.

అక్కడ గుడగుడలు సాగుతోన్నంతసేపూ అరుణ "అమ్మో... అమ్మో...." అని కెవ్వు కెవ్వున అరుస్తోనే వుంది. కాస్సేపటికి 'సరే, సరే' అని స్తిమిత పడింది.

వాసూ, ఆ గుసగుసలన్నీ పసికట్టాలని చూశాడు. సాధ్యం కాలేదు.

తర్వాత కమల అందరికీ వినపడేలాగ ఒక ప్రకటన చేసింది "అక్కయ్యా! నేను కళ్ళు తెరిచాను. మా ఆయనకి నా మీద ఏమీ ప్రేమ లేదని అర్థమైపోయింది. నేను ఒక్కగంట విశ్రాంతిగా వుండడానికి కూడా ఆయన నా కోసం ఏ పనీ చెయ్యడు. ఇలాంటి సంసారం ఇంకా గుడ్డిగా నేను చెయ్యదల్చుకోలేదు. నా దారిన నేను వెళ్ళిపోతున్నాను. నాకు వుద్యోగం వుంది. జీతం వస్తుంది. నా బతుకు నేను బతగ్గలను.

"నేను కూడా చిన్నాని తీసుకుని నీతోనే వొచ్చేస్తాను కమల! నేను ఏదైనా పని చూసుకునే దాకా మా ఇద్దరికీ కొంచెం అన్నం పెట్టు. నీకు వున్న స్వతంత్రం నాకు ఎందుకు లేదో నాకు ఇప్పుడు అర్థమైంది. నా పిల్లాణ్ణి నేనే పోషించుకుంటాను. నేనే పెంచుకుంటాను. ప్రేమ లేని భర్త దగ్గర నేనూ వుండను... అయితే మన బట్టలన్నీ సర్దేస్తాను తొందరగా" అంది అరుణ వుత్సాహంగా.

తర్వాత వంతు శకుంతలది! "నేను కూడా వొచ్చేస్తానమ్రా మీతో. ఎన్నేళ్ళు కాపరాలు చేసినా ఈ ముదనష్టపు మొగాళ్ళకి పెళ్ళాల మీద గుడ్డిగవ్వంత అభిమానం కూడా రాదు. ఎందుకీ పాడు సంసారాలూ? నేనూ, అరుణా ఏ పచ్చళ్ళు పెట్టుకునో, అప్పడాలు చేసుకునో, బట్టలు మీద అద్దాలు కుట్టుకునో, ఎలాగో ఒకలాగ నాలుగు రాళ్ళు సంపాదించుకోలేకపోము. నా బట్టలు కూడా తెచ్చుకుంటా నుండండి. కామేశ్వరిని కూడా పిల్చుకొచ్చేస్తాను" అని తను కూడా బైల్దేరడానికి సిద్ధమైంది.

రేఖ కూడా ముందుకొచ్చింది. "పెద్దొదినా! నేనూ వొచ్చేస్తాను. ఏదన్నా వుద్యోగం చూసుకుంటాను."

వేణు అందరి కన్నా ముందే తయారయ్యాడు - నేనూ మీ తోటే. ఈ పురుష అహంకారులతో కలిసి నేను వుండను. అమ్మనీ నాన్ననీ కూడా మనతోటే తీసికెళ్ళిపోదాం. వాళ్ళని మనమే జాగ్రత్తగా చూసుకుంటాం. వెళ్ళగానే పప్పు నానబోసి గారెలు వొండేసుకుందాం."

అప్పటి దాకా కాలు మీద కాలేసుకుని కూర్చున్న వాసూకి కాళ్ళు వణకడం మొదలైంది. బెంబేలెత్తిపోతూ అన్నగారి చెవి మీద పడి "అన్నయ్యా, సీనంతా ఇలా మారిపోయిందేవిటి? వేణూ గాడొకడు, వాళ్ళకి నాయకత్వం! తెగనూరిపోసేస్తున్నాడు. వాళ్ళు గారెలు కూడా వొండుకుంటారట! అందరూ వెళ్ళిపోయేలాగ వున్నారు! బట్టలు సర్దేసుకుంటున్నారు! తప్పయిందని వొప్పేసుకుందాం అన్నయ్యా!" అని లబలబలాడాడు.

ప్రసాద్ గంభీరంగా - "నువ్వు తప్పు వొప్పేసుకో. కమల వుద్యోగం చేస్తోంది. నువ్వు ఇంటి పనులు చెయ్యడం చాలా న్యాయం" అని తమ్ముడికి

హితోపదేశం చేశాడు.

"ఏవిటీ నేనొక్కణ్ణే లొంగిపోవాలా? కమల జీతం మేమిద్దరమే దాచుకుంటున్నామా? ఇంటి కోసమే వాడుతున్నాం కదా? ఇంటి పని నువ్వు మాత్రం ఎందుకు చెయ్యొద్దూ?'' అని కస్సుమన్నాడు వాసూ.

'ఓహో! నువ్వూ తిరగబడ్డావా? సరే, సరే! ... ముందు నీ పని కానీ! తర్వాత నేనూ... నెమ్మదిగా'

వాసు, కమల ముందు నిలబడి పాఠం అప్ప జెప్పేశాడు. "కమలా! ఎక్కడికీ వెళ్ళొద్దు. నువ్వు లేకపోతే నేను బతకలేను!'' అయిపోయింది పాఠం!

"అవును మరి. అన్నం వొండే వాళ్లెవరూ వుండరు కదా? మీకేమో పాపం వొండుకోడం రాదయ్యే! బతకడం కష్టమే... అక్కయ్యా! సర్దడం అయిపోయిందా?

"అందుక్కాదు కమలా! నువ్వు జడ వేసుకోడానికి క్కూడా ఖాళీ లేకుండా ఇంటా బయటా బోలెడు శ్రమ పడిపోతుంటే నేను ఎంత బాధపడిపోతున్నానో నీకేం తెలుసు?''

"వేణూ! ఆటోలు పిలువు'' అని కమల కేక పెట్టింది.

"వొద్దు కమలా! నా మాట విను కమలా! మీరెలా చెప్తే అలా వింటాం. వంటంతా నేర్చుకుంటాం.''

అరుణ ఆ డైలాగ్ కోసమే చెవులింతింత చేసుకుని ఎదురు చూస్తోంది.

"వాసూ! వింటాం కుంటాం అంటున్నావు. మీ అన్నగారు కూడా వింటారా? మీ అన్నగారు కూడా కుంటారా?''

ప్రసాద్ ముందుకొచ్చాడు - "నేను ఇంటి పని కూడా చెయ్యాలంటే, మరి నువ్వు బైట పని కూడా చేస్తావా? ఏం వుద్యోగం చేస్తావు?''

"ఆఁ... వున్నాయి వుద్యోగాలు రాసులు పోసి! అయ్యో! అవును, అసలు అదే అడగాలి!'' అని అరుణ గబగబా ఫోను తిప్పింది. "హలో... హలో! గవర్నమెంటుగారు కావాలండీ! అర్జంటుగా కావాలండీ....!''

అవతల నించీ "చెప్పమ్మా! స్టే అందిందా? మీ మొగాళ్ళు పని చేస్తున్నారా?''

"అయ్యో! వాళ్లు కూడా ఇంటి పనులు చెయ్యా లంటే, మేం కూడా బైట పనులు చెయ్యాలండీ! లేకపోతే, వాళ్ళేమంటున్నారో తెలుసాండీ? నేను బైట పని చేస్తున్నానుగా నువ్వే ఇంటి పని చెయ్యి! నాకు ఆ పనీ, నీకు ఈ పనీ, అంటున్నారండీ! వుద్యోగాలు లేని ఆడవాళ్లం బోలెడు మంది వున్నామండీ! నేనూ, శకుంతలా, కామేశ్వరీ, రేఖా, ఇంకా చాలా మంది వున్నామండీ! అందరికీ వుద్యోగాలు కావాలండీ! ఈ స్టేలూ, ఈ బిల్లులూ, ఈ సెలవలూ, ఈ చట్టాలూ, ఇవన్నీ మా కొద్దండీ! వుద్యోగాలు లేకపోతే మొగాళ్ల సంపాదన మీద ఆధారపడి బతకవలసిందే కదండీ! అయ్యా, వింటున్నారా?... హలో!... హలో...! హలో...! కమలా! ఇదేమిటీ? వుద్యోగాల మాటెత్తితే గవర్నమెంటు పలకడం లేదేం? అయ్యో, ఇదేమిటి?...''

"సరేలే, తర్వాత చూద్దాం. తొందరగా రా అక్కయ్యా! ఆలస్యమైపోతోంది. ఇల్లు మారాక తొందరగా అన్నం వండి, చిన్నికీ మావయ్యకీ పెట్టాలా వొద్దా?''

హాల్లో తలుపు చాటున హనుమంతు శకుంతలని తెగబతిమాలుకుంటున్నాడు - ఎక్కడికీ వెళ్ళొద్దని.

"ఇంటికి పోదాం పద. కాఫీ పెట్టేస్తాను. ఎంత సేపు? పావుగంటలో పప్పూ, పులుసూ అన్నీ వండేస్తాను'' అంటున్నాడు.

"వేదాల్లో రాశారా మరీ?'' అంది శకుంతల.

'ఏదో మిడికార్లే. వాళ్ళ గోల మనకెందుగ్గానీ' అని ఇకిలించాడు హనుమంతు.

దగ్గుల జగన్నాథం అప్పుడు నిజంగానే నోరు తెరిచి "హనుమంతూ, ఇలారా!'' అని కేక పెట్టాడు.

"వొస్తున్నా బావా!'' అంటూ హనుమంతు వినయంగా జగన్నాథం ముందు హాజరయ్యాడు.

"పొద్దున్న నుంచీ అంతా వింటూనే వున్నా నోయ్!... ఆడపిల్లలతో మీకు పంతాలా? వాళ్లు ముద్దుగా అడిగితే చేసి పెట్టలేరా? ఖాంగ్!''

"అబ్బే! వొండుతాననే అంటున్నాను బావా! కానీ, వాళ్ళు ముద్దుగా అడిగారా? గుద్దులేస్తూ అడిగారు. మొదట ఆత్మరక్షణ కోసం కొంచెం పెనుగులాడాం అనుకో.''

"మా పెద్దవాళ్ళిద్దరికీ కాస్త వంటా వార్పూ నేర్పు! ... వాసూ! ప్రసాద్! మీరిద్దరూ మావయ్య దగ్గిర ఒక్క వారం రోజుల్లో అన్నీ నేర్చుకోవాలి, తెలిసిందా? వొచ్చే ఆదివారం నాడు మీరిద్దరే పులిహోరా, గారెలూ చెయ్యాలి! విన్నారా? ఖంగ్! ఖంగ్!''

"ఆఁ...· విన్నాం గానీ నాన్నా! నువ్వు ఏ నాడన్నా అమ్మకి గ్లాసుతో మంచి నీళ్ళన్నా ఇచ్చావా? పేద్ద... ఇవ్వాళ మేం దొరికామా నీకు?'' అని ఎదురు తిరిగారు పుత్రులిద్దరూ!


"నేను మంచి నీళ్ళిచ్చేదాకా ఆగితే... ఖంగ్... మీ అమ్మపని అయినట్టే! మా రోజులు వేరు! మీ అమ్మకి చెప్పాలనీ తెలీదు, నాకు చెయ్యాలనీ తెలీదు. ఎందుకూ, నాకు దగ్గు తగ్గనివ్వండి... ఆ మూలా ఈ మూలా చూడండి, బూజులు ఎలా వేళ్ళాడుతున్నాయో... వాటి పని నేను పడతాను... ఈలోగా బూజుల కర్ర కొని పట్టుకు రండి!... అన్నట్టు వాకిట్లో మొక్కల నిండా చీడ పట్టింది. మొన్న చూశాను.... దగ్గు తగ్గాక దాని పని కూడా చూస్తాను... ఖంగ్! ఖంగ్!... అమ్మాయ్ అరుణా! కమలా! మీరిద్దరూ ఇలా రండి! మీ బట్టలవీ మళ్ళీ అలమారుల్లో పెట్టేసుకోండి! వాళ్ళిద్దరూ ఈ పూట నించే మీరు చెప్పినట్టు పని చెయ్యకపోతే వాళ్ళ బట్టలు తీసి బైటికి విసిరెయ్యండి. వాళ్ళే బైటికి వెళ్తారు. తెలిసిందా? ఖాంగ్....''


అరుణ సంతోషంతో పెద్ద కేక పెట్టింది. "మావయ్య చెప్తున్నారుగా, కమలా రావే! బట్టలన్నీ ఎక్కడివక్కడ పెట్టేద్దాం. అత్తయ్యా, మీరు కమలకి సాయం చేయండి! నేను మావయ్యకి గుక్కెడు కాఫీ ఇచ్చి వొచ్చేస్తాను.''

"లక్ష్మి వొచ్చింది'' అని రేఖ అరిచింది.

జ్వరం తగ్గీ తగ్గకుండానే వచ్చింది లక్ష్మి.

'గిన్నెలన్నా తోమి పెడదామని వొచ్చానమ్మా!' అంది నీరసంగా పనికి వుపక్రమిస్తూ.






అన్నపూర్ణమ్మ అడ్డం పడి "మంచిదానివే! ఇంకా మొహం అలాగే వుంది. జ్వరంతో ఏం చేస్తావు?... తగ్గేదాకా రావొద్దని చెప్పలేదూ? ఇంత మంది వున్నాం. మేమే చేసుకుంటాంలే. ఇంటికెళ్ళి పడుకో" అంది.

కమల పరుగెత్తి కొచ్చి "లక్ష్మీ! ఇవ్వాళ ఆడవాళ్ళకి సెలవు కదా? వంట మీ ఆయన చేశాడా లేదా?" అని ఆరా తీసింది.

"నాకు జొరం కదమ్మా! పొద్దున్న నేను లేవలేదని తనే వుడకేశాడు. జొరం లేకపోతే చేస్తాడేంటమ్మా?"

"కానీ, నువ్వా బైట పని చేస్తున్నావు కదా? అందుకని, మీ ఆయన్ని కూడా రోజా ఇంట్లో వున్నప్పుడు ఆ పనీ ఈ పనీ చెయ్యమనీ చెప్తూం వుండు. చూడు, ఇవ్వాల్టి నించీ మా మొగాళ్ళని ఇంటి పనిలోని దింపేస్తున్నాం!" అంది కమల పొంగిపోతూ.

"ఆఁ... ఎందుకు చేస్తారులేమ్మా?" అని నవ్వింది లక్ష్మి, నమ్మలేక.

వేణూ లక్ష్మికి గిన్నెతో వుప్మా అందించి - 'నేనే చేశాను లక్ష్మీ' అన్నాడు. తర్వాత వేణూ, వదినల ముందు ఒక ప్రతిపాదన పెట్టాడు - "మన ఇంటి పనుల్లో మూడో వంతు పని లక్ష్మే చేస్తోంది. ఆమెకి ఇది 'బైట పని'! కానీ మనం ఇన్నాళ్ళూ లక్ష్మి సెలవు గురించి ఆలోచించనే లేదు. తక్షణం ఇప్పుడు ఆలోచించండి!" అన్నాడు.

"అవును వేణూ! 'బైట పని'కి సెలవు వుండాలి కదా? అలాగే చేద్దాం" అంది కమల.

అరుణ సంతోషంగా - "లక్ష్మీ! ఇవ్వాల్టి నించీ నీకు ప్రతీ ఆదివారం సెలవు" అంది.

"ఎందుకమ్మా? వొద్దులేమ్మా" అంది లక్ష్మి సిగ్గుపడుతూ. కానీ లక్ష్మి మొహం సంతోషంతో వెలిగిపోయింది. వుప్మా గిన్ని తీసుకుని వెళ్లిపోయింది.

'సందట్లో సడేమియా' అనీ, ఆ గోలలోనే "అన్నపూర్ణమ్మగారూ!" అంటూ పేరయ్య గారు ప్రవేశించాడు.

"అయ్యో! నా మతి మండా! రండి పేరయ్య గారూ! మీ సంగతి మరిచేపోయానండీ!" అని అన్నపూర్ణమ్మ పేరయ్యని ఆహ్వానించింది.

"మీరు మరిచిపోతే నేను మరిచిపోతానా?... మరి పెళ్ళివారిని సాయంత్రం తీసు కు రమ్మంటారా? వారు సిద్ధంగానే వున్నారు."

రేఖ కంగారుగా వొచ్చి - "అమ్మా, వొద్దని చెప్పు. తీసుకు రావొద్దు" అంది.

"అదేవిటే, నిన్న అనుకున్నదేగా? నిన్న సరే అన్నావుగా?" అని తెల్లబోయింది అన్నపూర్ణమ్మ.

"అంటే అన్నాను. అది 'నిన్న'. ఇవ్వాళ చాలా నేర్చుకున్నాను. అసలు నాకు స్వంత సంపాదన వుంటే తప్ప మిగతా విషయాలు ఆలోచించను. తనని తను పోషించుకోలేని మనిషి, జీవచ్ఛవంతో సమానం అమ్మా! ఇక 'స్వతంత్రం' గురించి ఆలోచించడానికేం వుంటుంది? 'ఆడా మగా సమానం' అని ఆలోచించే మనిషిని తప్పితే నేను ఎంచుకోను. అదంతా ఇప్పుడు కాదు. పేరయ్య గారికి చెప్పెయ్యి!"

అన్నపూర్ణమ్మ తూచా తప్పకుండా చక్కగా బుగ్గలు నొక్కుకుంటూ 'అవ్వ' అంది. "నువ్వు చెప్పింది పేరయ్యగారూ విన్నారుగా? ఇక నేను చెప్పేదేవిటి? చూశారా పేరయ్యగారూ! ఏవిటో... పెద్దవాళ్ళు చెప్పడం, చిన్నవాళ్ళు వినడం అంతా పోయిందండీ ఈ రోజుల్లో!" అని తెగ నొచ్చుకుంది.

"పోనీ లెండమ్మా! తొందరేమొచ్చింది? అమ్మాయి మంచి మాటే చెప్పిందిగా? వాళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళే చేసుకుంటే, మనకి అంతకన్నా ఏం కావాలి? మనకీ బరువు తప్పుతుంది. మ వెళ్ళొస్తానమ్మా" అని వెళ్ళి రావడానికి వెళ్ళా పేరయ్యగారు.

పేరయ్యగార్ని సాగనంపి అన్నపూర్ణవ లోపలికొస్తూ - "హనుమంతూ! ఇప్పుడేం ఇం పోతారు గానీ, ఇద్దరూ వుండిపొండి. సాయంత్ర వెళ్ళొచ్చు" అంది.

ప్రసాద్ ఆనందంతో మావయ్య మీద ప "అవును మావయ్యా! ఇక్కడే వుండు. పద. వ మొదలు పెడదాం" అని హనుమంత వంటింట్లోకి లాక్కుపోయాడు.

అరుణ - బొడ్లో చెంగు దోపేసుకుని "అంద వినండి!" అని అందరికీ ఆర్డర్లు జారీ చేసింది "వాసూ! నువ్వు కూడా వంటింట్లోకి వెళ్ళు! ప నానబెట్టి, కొబ్బరి పచ్చడి చెయ్యి!

రేఖా! నువ్వు అంట్లు తోమెయ్యి!

కమలా! నువ్వు గదులూ వాకిళ్ళ వూడ్చుకురా!

నేను, సాయంత్రానికి కావలసిన బట్టల వుతికేస్తాను.

శకుంతల పిన్నీ! నువ్వు ఇంటికెళ్ళి, పను చేసుకుని తొందరగా వచ్చెయ్యి!

వేణూ! నువ్వు స్నానం చేసేసి ఏదనా చదువుకో! ఇంక నీకు సెలవ్!

అత్తయ్యా! మీరు మావయ్య స్నానం సంగ చూడండి! తర్వాత, చిన్నిగాడికి కూడా నీళ్ళ పోసేసి మీరూ స్నానం చెయ్యండి!

కమలా! చిన్నికి కూడా చిన్న చీపురియ్యి! వెనకాల వుంచుకుని వాడికి కూడా వూడ్చడ నేర్పు!

నాన్నా! పిన్ని దగ్గర వూడ్చడం నేర్చుకోమ్మ

తర్వాత, నాయనమ్మతో నీళ్ళు పోయి చుకో! నాన్నా తాతయ్యా అన్నం వొండేస్తున్నారుగా? అప్పుడు తినేద్దువు గానీ!"

చిన్నిగాడు ఆనందంతో వుక్కిరిబిక్కిరైపోతూ - "అమ్మా! ఆదివారం ఎళ్ళిపోయిందా?" అని ఎగబడ్డాడు.

అరుణ నవ్వి - "ఆదివారమా? సగ వెళ్ళిపోయిందీ, సగం వుందీ! ఇప్పుడు పొద్దున్నలా కాదమ్మా! రోజా నేనూ నాన్నా కలిసే నిన్ను పెంచుతాం. సరేనా? చీపురు తెచ్చుకో!"

చిన్నిగాడు ముందు నాయనమ్మ దగ్గిరి పరిగెత్తాడు - నాయనమ్మా, నాయమన్మా! అమ్మ ఆదివారం వుందంటా, లేదంటా!"

(అయిపోయింది